పిఠాపురం పాదగయకు పోటెత్తిన భక్తులు 6


కార్తీక సోమవారం సందర్భంగా పాదగయ పుష్కరిణిలో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

తుఫాన్ సహాయార్థం రూ.కోటి విడుదల

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ బాధితులకు ఆహారం, దుస్తులు, వసతి, రవాణా వంటి సౌకర్యాల నిమిత్తం రాష్ట్ర విపత్తుల నిర్వహణశాఖనుంచి టీఆర్ 27పద్దు కింద ఒక రూ.కోటిని సోమవారం విడుదల చేశారు. సహాయక చర్యల నిమిత్తం రూ.5కోట్లు కావాలని ప్రతిపాదనలు పంపగా ఇప్పటికి రూ.కోటి విడుదలైంది. మిగిలిన నిధులను దఫాదఫాలుగా విడుదల చేయనున్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న పవన్‌కల్యాణ్

ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి

- తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో యంత్రాంగాన్ని అప్రమత్తం చేయాలి
- ఇన్‌చార్జి మంత్రి, అధికారులతో డిప్యూటీ సీఎం వీడియో కాన్ఫరెన్స్

పిఠాపురం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావం అధికంగా ఉండే జిల్లాలోని 12మండలాల్లో ఏ పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు అధికారయంత్రాగం అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సూచించారు. తుఫాన్ పరిస్థితులపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి పి.నారాయణ, జిల్లా ప్రత్యేక అధికారి కృష్ణతేజ, కలెక్టర్ షాన్‌మోహన్, ఎస్పీ బిందు మాధవ్ తదితర అధికారులతో ఆయన సోమవారం వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభావిత ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, పునరావస కేంద్రాలకు తరలివెళ్లే ప్రజల గృహాలకు భద్రత కల్పించాలని తెలిపారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులను ముందుగానే తరలించాలన్నారు. ఇప్పటికే 142మంది గర్భిణులను గుర్తించి సురక్షితప్రాంతాలకు పంపామని కలెక్టర్ తెలిపారు. కమ్యూనికేషన్ల వ్యవస్థ దెబ్బతినే అవకాశం ఉన్నందున శాటిలైట్ ఫోన్లను సిద్ధం చేసుకుని వాటి ద్వారా సమాచారం ఎప్పటికప్పుడు అందరికీ చేరేలా చూడాలన్నారు. ఏలేరునుంచి భారీగా నీరు విడుదల చేసే అవకాశం ఉన్నందున పిఠాపురం నియోజకవర్గంతో పాటు అన్నిప్రభావిత ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. చెరువులు, కాలువల గట్లు పటిష్టం చేయాలని తెలిపారు. గండ్లు పడితే తక్షణం పూడ్చేందుకు వీలుగా ఇసుకబస్తాలు సిద్ధం చేయాలన్నారు. మత్స్యకారులు వేటకు వెళ్లకుండా కట్టడి చేయలని, బోట్లు దెబ్బతినకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అధికార యంత్రాంగం పూర్తి అప్రమత్తతతో వ్యవహరించి అండగా ఉండాలని తెలిపారు.

ప్రజలను అప్రమత్తం చేయాలి: సీఎం

కలెక్టరేట్(కాకినాడ),అక్టోబరు27(ఆంధ్రజ్యోతి: మొంథా తుఫాన్‌పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు.సోమవారం ఆయన అమరావతి సచివాలయం నుంచి ఉన్నతాధికారులతో,జిల్లా కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్‌నుంచి జిల్లా ఇన్‌చార్జి మంత్రి నారాయణ, ఎంపీ ఉదయ్, రాజ్యసభ సభ్యుడు సతీష్, కలెక్టర్ షాన్‌మోహన్, ఎస్పీ బిందుమాధవ్‌లతోపాటు ఇతర అధికారులు హాజరయ్యారు.


ముంచుకొస్తోంది : ఉప్పాడ కొత్తపల్లి వద్ద సముద్రం

మొత్తమొంథా.. అలజడి!



ఉప్పాడ వద్ద కల్లోల తీరం..


సురక్షిత ప్రాంతాలకు : కాట్రేనికోన వద్ద మత్స్యకారుల తరలింపు



(కాకినాడ - ఆంధ్రజ్యోతి)
మొంథా తుఫాన్ ముంచుకొస్తోంది. ఆగ్నేయ బంగాళాఖాతంలో రెండు రోజులుగా కొనసాగుతున్న వాయుగుండం ఆదివారం అర్ధరాత్రి తర్వాత తుఫాన్‌గా బలపడింది. ఈ క్రమంలో ఉత్తర వాయువ్యంగా పయనించి నైరుతి, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ప్రవేశించింది. సోమవారం మధ్యాహ్నం సమయానికి కాకినాడకు 490 కి.మీ వద్ద తుఫాన్ కేంద్రీకృతమై ఉంది. సోమవారం ఉదయం నుంచి గంటకు 17 కి.మీ. వేగంతో ప్రయాణిస్తోంది. అదే వేగంతో పయనించి మంగళవారం సాయంత్రం లేదా రాత్రికి మచిలీపట్నం-విజయనగరం మధ్య కాకినాడ వద్ద తీరం దాటుతుందని భారతవాతావరణ శాఖ తెలిపింది. అయితే తీవ్ర తుఫాన్ కాకినాడ-యానాం మధ్య తీరం దాటే అవకాశం ఉందని ఇస్రో వాతావరణ నిపుణులు చెబుతున్నారు.

ఈ రాత్రి గడిస్తే చాలు

1996 నవంబరు 6న రాత్రి ఒక్కసారిగా తుఫాన్ వచ్చింది.. కోనసీమను తుడిచిపెట్టేసింది.. మొంథా తుఫాన్ మంగళవారం రాత్రి కాకినాడ వద్ద తీరం దాటుతుందని అంచనా. దీంతో ఉమ్మడి జిల్లాలో ప్రతి ఒక్కరూ ఈ రాత్రి గడిస్తే చాలనుకుంటున్నారు..

గంటకు వేగం 100 కి.మీ..

సీఎం, డిప్యూటీ సీఎం సమీక్షలు..

ఉమ్మడి జిల్లాలో ప్రధానంగా కాకినాడ, కోనసీమ జిల్లాల తీరప్రాంతాల్లో తుఫాన్ బీభత్సం అధికంగా ఉండనున్నందున ఈ ఇద్దరి కలెక్టర్లతో సీఎం చంద్రబాబు తరచూ సమీక్షలు నిర్వహిస్తున్నారు. బాధితులకు ఏ ఇబ్బంది కలగకుండా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. కాకినాడ జిల్లాలో పునరావాస శిబిరాలకు వెళ్లినచోట ప్రజల ఇళ్లకు ఇబ్బందులు లేకుండా గస్తీ పెంచాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశించారు. అన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు ప్రజలకు అందుబాటులో ఉండి సహాయక చర్యలు ముమ్మరం అయ్యేలా చూడాలని మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు.

రోజంతా ఒక్కటే వాన..

తుఫాన్ ప్రభావంతో సోమవారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల్లో పలు చోట్ల భారీ వర్షాలు పడగా.. రాత్రి నుంచి వర్షాల తీవ్రత ఒక్కసారిగా పెరిగింది. తుఫాన్ మంగళవారం అర్ధరాత్రికి తీరం దాటనుండడంతో మంగళవారం నుంచి పెనుగాలులు అధికంగా ఉంటాయని ..అత్యవసరమైతే తప్ప ప్రజలెవరూ బయటకు రావొద్దని అధికారులు హెచ్చరించారు. తుఫాన్ ధాటికి చెరువులు, రిజర్వాయర్లు, కాలువలు పొంగిపొర్లుతున్నాయి. అనేక చోట్ల గండ్లు పడే ప్రమాదం ఉండడంతో జలవనరుల శాఖ అధికారులు ఇసుక బస్తాలు సిద్ధం చేశారు. విద్యుత్‌శాఖ విద్యుత్ సరఫరాలో అంతరాయాలను సరిదిద్దడానికి వీలుగా అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

దూసుకొస్తున్న తుఫాన్

- వణుకుతున్న ఉమ్మడి జిల్లాలు
- ఇప్పటికే భారీ వర్షాలు.. గాలులు
- అల్లకల్లోలంగా మారిన తీరం
- కాకినాడ - యానాం మధ్య హైఅలర్ట్
- తీరం దాటుతుందన్న సంకేతాలు
- పోర్టులో ఏడో నెంబరు హెచ్చరిక
- పలు రైళ్లు, విమానాలు రద్దు
- సీఎం, డిప్యూటీ సీఎం సమీక్షలు

గాలుల తీవ్రత మంగళవారం సాయంత్రానికి గంటకు 100 కిలోమీటర్ల వరకు ఉంటాయన్న హెచ్చరికలు ప్రజల్లో వణుకుపుట్టిస్తున్నాయి. మరో వైపు సోమవారం రాత్రి కాకినాడ పోర్టులో ఏడో నెంబరు ప్రమాద హెచ్చరిక ఎగుర వేశారు. హుద్‌హుద్ తుఫాన్ తర్వాత మళ్లీ ఆ స్థాయిలో ప్రమాద హెచ్చరికలు జారీ అవడం తుఫాన్ తీవ్రతను చాటుతోంది. సామర్లకోట,రాజమహేంద్రవరం మీదుగా వెళ్లే పలు రైళ్లను రద్దు చేశారు.రాజమహేంద్రవరం విమానాశ్రయం నుంచి వెళ్లే పలు విమానాలు రద్దుచేశారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని బీచ్‌లకు వెళ్లే అన్ని రహదారులు మూసివేశారు.

కాకినాడలో 269 పునరావాస కేంద్రాలు

కాకినాడ జిల్లాలో 12 తుఫాన్ ప్రభావిత మండలాల్లో 269 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ స్వయంగా అధికారులతో కలిసి ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు.జిల్లాలో 3.35 లక్షల మందిపై తుఫాన్ ప్రభావం చూపుతుందని గుర్తించారు. నిత్యావసరాలు తగిన ప్రదేశాల్లో ఉంచేలా పౌరసరఫరాలశాఖ ఏర్పాట్లు చేసింది. విద్యుత్,ఫైర్ సిబ్బందిని అందుబాటులో ఉంచారు. కాకినాడ జిల్లాలో తుఫాన్ తీరం దాటుతుందన్న సమాచారంతో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నారాయణ సోమవారం అధికారులను అప్రమత్తం చేశారు.

కోనసీమలో 90 కి.మీ తీరం

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)
కోనసీమ జిల్లాకు రెండు ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు చేరుకున్నాయి. తుఫాన్ సహాయక, పునరావాస చర్యలపై ప్రత్యేకాధికారిగా నియమితులైన విద్యాశాఖ డైరెక్టర్ వి.విజయరామరాజు అమలాపురంలోని కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మహేష్‌కుమార్, జేసీ నిశాంతి పరిశీలించారు. జిల్లా పరిధిలో సుమారు 90 కి.మీ తీర ప్రాంతం ఉండగా 120 పునరావాస కేంద్రాల్లోకి ఆరు వేల మందిని తరలించేలా ఏర్పాట్లు చేశారు. సఖినేటిపల్లి-నరసాపురం మధ్య పంటు రాకపోకలు నిలిపివేశారు.

తూర్పున యంత్రాగం అప్రమత్తం

తుఫాన్ హెచ్చరికలతో తూర్పుగోదావరి జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. ఎస్‌డీఆర్ఎఫ్ బృందం జిల్లాకు చేరుకుంది. ముఖ్యంగా విపత్తు నిర్వహణ శాఖ, పోలీస్, రెవెన్యూ పునారావాస, భద్రత తదితర ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఏలూరు రేంజ్ ఐజీ అశోక్ కుమార్ రాజమహేంద్రవరం చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మంత్రి దుర్గేష్ కంట్రోల్ రూమ్‌లను పరిశీలించారు. తుఫాన్ జిల్లా ప్రత్యేక అధికారిగా నియమించిన కె.కన్నబాబు నిడదవోలులో పర్యటించారు.

మొంథా తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు..

ఏర్పాట్లు సిద్ధం

- తుఫాన్ ప్రభావిత మండలాల్లో 269 పునరావాస కేంద్రాలు
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి నారాయణ
- 'ఏలేరు'లో వరద ప్రవాహాన్ని గమనిస్తున్నాం
- జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్



సమీక్ష అనంతరం విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి నారాయణ

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌ను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి అన్నిఏర్పాట్లు చేశామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణ వెల్లడించారు. కాకినాడ కలెక్టరేట్‌లో సోమవారం మొంథా తుఫాన్‌కు సంబంధించిన ఏర్పాట్లపై జిల్లాకలెక్టర్ షాన్‌మోహన్, తుఫాన్ జిల్లా ప్రత్యేకాధికారి కృష్ణతేజ, జిల్లా ఎస్పీ బిందుమాధవ్, ఎంపీలు ఉదయ్,హరీష్, సతీష్‌లతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రినారాయణ మాట్లాడుతూ కాకినాడ తీరప్రాంత మండలాల్లోఉన్న పునరావాస కేంద్రాలకు నిరంతరం ఆహారం, తాగునీరు సరఫరా చేసేలా ఏర్పాట్లు చేశామన్నారు. జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ ఏలేరు రిజర్వాయర్‌లో 24.11 టీఎంసీ వరకు స్టోరేజ్ కెపాసిటీ ఉందన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 21.97 టీఎంసీల నీటినిల్వ ఉందన్నారు. 0.5టీఎంసీలు నీటిని వదిలి దాన్ని21.5 టీఎంసీలకు తీసుకొస్తామన్నారు. తుఫాన్ ప్రభావంతో ఏజెన్సీలో అధిక వర్షాలు కురిసి ఏలేరు రిజర్వాయర్ నిండిపోతే 5వేల క్యూసెక్కుల వరకు నీటిని కిందికి వదిలే అవకాశం ఉందన్నారు. 5వేల కంటే ఎక్కువ క్యూసెక్కుల నీటిని వదిలితే సామర్లకోట, జగ్గంపేట, కిర్లంపూడి, పిఠాపురం, గొల్లప్రోలు, ఉప్పాడ మండలాలు ఎక్కువగా ప్రభావితం అవుతాయన్నారు. మంగళ,బుధవారాల్లో భారీవర్షాలు, గంటకు 90 కిలోమీటర్ల నుంచి 110 కి.మీ వేగంతో ఈదురుగాలులు ఉంటాయన్నారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు.

ఐదు మండలాలనుంచి..

జిల్లాలో ఐదు మండలాలు ఉప్పాడ, తొండంగి, కాకినాడ అర్బన్, కాకినాడ రూరల్, తాళ్లరేవు మండలాల్లో లోతట్టు ప్రాంతవాసులను పునరావాస కేంద్రాలకు తరలించినట్లు కలెక్టర్ షాన్‌మోహన్ వెల్లడించారు. ఉప్పాడలో 3వేల మంది, తాళ్లరేవులో వెయ్యిమంది, తొండంగిలో 1200మందిని పునరావాస కేంద్రాలకు తరలించారు. కాకినాడఅర్బన్, కాకినాడ రూరల్ నుంచి కూడా తరలింపు జరుగుతోంది.

ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు సిద్ధం

తుఫాన్ బాధితులను రక్షించడానికి ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు రంగంలోకి దింపారు. 30 మంది బృందంతో ఉప్పాడలో ఒక టీమ్, మరో 30మంది బృందంతో తాళ్లరేవులో మరొక టీమ్‌ను సిద్ధం చేశారు. 140మంది గజఈతగాళ్లను సిద్ధంగా ఉంచారు. ప్రతి గ్రామంలో ఒక ఎక్స్‌కవేటర్‌తోపాటు రెండు ట్రాక్టర్లు, రెండు డీజిల్ ఇంజన్లు, వంట మనిషిని నియమించారు.

అన్నవరంనుంచి 10వేల ఆహార ప్యాకెట్లు

తుఫాన్‌బాధితులకు అన్నవరందేవస్థానం నుంచి 10వేల ఆహార ప్యాకెట్లు సిద్ధం చేశారు. అక్షయపాత్ర, అల్లూరి సీతారామరాజు ఫౌండేషన్లనుంచి మరో 10వేల ఆహార ప్యాకెట్లు సిద్ధం చేశారు. దివీస్ ఫార్మా కంపెనీ నుంచి కూడా ఆహారం సరఫరా అవుతుంది. 60వేల లీటర్ల పాలను సేకరించారు.

అత్యవసర సేవలు

ఎక్కడైనా ప్రమాదాలు జరిగితే వారిని అంబులెన్స్‌ల ద్వారా ఆస్పత్రికి తరలించడానికి 108వాహనాలు 23, 104వాహనాలు 35 సిద్ధంగా ఉంచారు. డీఎంఅండ్‌హెచ్‌వో ఆధ్వర్యంలో మొబైల్ వైద్యబృందాలు సిద్ధంగా ఉన్నాయి. పాముకాట్లు, విషపురుగులనుంచి రక్షణ నిమిత్తం ప్రభావిత మండలాల్లో ఉన్న అన్ని సచివాలయాల్లో ఫస్ట్ ఎయిడ్ కిట్లు, మందులను సిద్ధంగా ఉంచారు. విషపురుగులు కుడితే వెంటనే సచివాలయంలో గానీ, పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల్లో సంప్రదించాలి. కాకినాడ జీజీహెచ్, ఉప్పాడ, తాళ్లరేవుల్లో ఉన్న పీహెచ్‌సీ, సీహెచ్‌సీల్లో ప్రత్యేకంగా అదనపు బెడ్లు సిద్ధంచేశారు.

ఉప్పాడలో వంటలు చేసేలా..

ఉప్పాడ, కోనపాపపేట, మూలపేటల్లో వంటలు చేసేందుకు వంట మనుషులను సిద్ధంగా ఉంచారు. వీరు ప్రతిరోజూ చేసిన వంటలను ఆయా గ్రామాల్లోఉన్న పునరావాస కేంద్రాల్లో బాధితులకు పంపిణీ చేస్తారు.

విద్యుత్ పునరుద్ధరణకు 3వేల పోల్స్

ఎక్కడైనా విద్యుత్ స్తంభాలు కూలిపోతే వెంటనే పునరుద్ధరణ కు వైజాగ్‌నుంచి 3వేల విద్యుత్ స్తంభాలు తీ సుకొచ్చారు. తిరుపతి, నంద్యాలనుంచి వెయ్యి మంది విద్యుత్‌శాఖ కాంట్రాక్ట్ కార్మికులను సిద్ధంగా ఉంచారు.

1996 తుఫాన్‌లో పెద్ద నష్టం
-ఎమ్మెల్యే వనమాడి, కాకినాడ సిటీ

1996లో పెనుతుఫానువల్ల పెద్దనష్టం జరిగింది. ఈనేపథ్యంలో పూర్తిస్థాయిలో రక్షణ చర్యలు తీసుకోవాలి.ఫిషింగ్‌హార్బర్‌లో బోట్లన్నింటినీ కెనాల్‌లో లంగర్ వేయాలి.

వృద్ధులు, పిల్లలకు వైద్యసాయం
-ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ

తుఫాన్ ప్రభావిత ప్రాంతంలో వృద్ధులు, పిల్లలను గుర్తించి వారికి మెడికల్ సాయం అందించేలా, రోగులను ఆస్పత్రులకు తరలించేలా ఏర్పాట్లు చేయాలి.

తొలిరోజు 133 కేంద్రాల్లో 16వేలమందికి ఆహారం

- తీరప్రాంతంలో 2,170 గృహాలను ఖాళీ చేయిస్తున్నాం
- పూర్తిగా అధికార యంత్రాంగం సిద్ధంగా ఉన్నాం
- ఆంధ్రజ్యోతితో కలెక్టర్ షాన్‌మోహన్



కలెక్టరేట్(కాకినాడ),అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి):మొంథా తుఫాన్‌బాధితులను పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నట్లు కలెక్టర్ షాన్ మోహన్ వెల్లడించారు. కాకినాడలో ఆంధ్రజ్యోతితో సోమవారం ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా 269 పునరావాస కేంద్రాల్లో ఏర్పాట్లు చేయగా తొలిరోజు సోమవారం 133 కేంద్రాల్లో 16,500మందికి ఆహారం సరఫరా చేశామన్నారు. తీరప్రాంతంలో ఉన్న మండలాల్లో 2,170గృహాలను ఖాళీ చేయించి పునరావాస కేంద్రాలకు వారిని తరలిస్తున్నామన్నారు. తుఫాన్ ఎఫెక్ట్ అయ్యే గ్రామాలనుంచి కొంతమందిని పోలీసుల సహకారంతో బలవంతంగా పునరావాస కేంద్రాలకు తరలించాల్సిన దుస్థితి నెలకొందన్నారు. 100 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తే జిల్లాలో 2వేల వరకు విద్యుత్ స్తంభాలు కూలిపోతాయని అంచనా వేశామని, ఈ నేపథ్యంలో 3వేల స్తంభాలు సిద్ధంగా ఉంచామని తెలిపారు. ట్రాన్స్‌కో టవర్లు పాడైతే తక్షణమే ఏర్పాటు చేయడానికి రాజమహేంద్రవరంలో నాలుగు మొబైల్ పవర్ ట్రాన్స్‌కో టవర్లు సిద్ధంగా ఉంచామన్నారు. వెయ్యిమంది విద్యుత్‌శాఖ కాంట్రాక్ట్ సిబ్బంది కూడా పోల్స్ వేయడానికి సన్నద్ధంగా ఉన్నారన్నారు.


కొత్తపల్లి మండలం ఉప్పాడ సముద్ర తీరాన్ని పరిశీలిస్తున్న ఎంపీ ఉదయ్

మొంథా తుఫాన్.. రెస్క్యూ బృందాల ఫోను నెంబర్లు

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మొంథా తుఫాన్ రెస్క్యూబృందాల ఫోను నెంబర్లను కలెక్టర్ షాన్‌మోహన్ విడుదలచేశారు.

జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి: 99499 91056
ఎన్‌డీఆర్ఎఫ్ కమాండెంట్(పిఠాపురం): 63704 77963
ఎస్‌డీఆర్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్(కాకినాడ): 8790598686
ఎన్‌డీఆర్ఎఫ్ కమాండెంట్ (తాళ్లరేవు): 8099672565

కాకినాడ కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నెంబరు

0884-2356801.. ఇది కాకినాడ కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ నెంబరు.. ఈనెల 31 వరకు 24గంటలూ ఇది పనిచేస్తుంది.

వరి.. వర్రీ!

- వర్షంతో గింజ పొల్లు బారే ప్రమాదం
- చిరుపొట్ట, పొట్ట, ఈనిక దశల్లో పంట
- తుఫాన్ ప్రభావంతో రైతుల్లో కలవరం



(పిఠాపురం-ఆంధ్రజ్యోతి)
తుఫాన్ ప్రభావంతో సోమవారం ఉదయం నుంచి కురుస్తున్న వర్షం రైతులను కలవరానికి గురిచేస్తోంది. వరి పంట కీలకమైన తరుణంలో ఏ మాత్రం అధికంగా వర్షాలు కురిసినా, వరద ముంపు ఏర్పడినా దానిప్రభావం దిగుబడులపై గణనీయంగా పడుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలోని మెట్ట, మైదాన ప్రాంతంలో ఖరీఫ్ సాగు ఈఏడాది పలు ప్రతిబంధకాల మధ్య సాగి ప్రస్తుతం ఆశాజనకంగా ఉంది. ప్రారంభంలో నీటి లభ్యత అంతంతమాత్రంగా ఉండడంతో ఏలేరు, పీబీసీ, పంపా ఆయకట్టులో రైతులు పలు ఇబ్బందులు పడ్డారు. నాట్లు వేసిన తర్వాత అక్కడక్కడ తెగుళ్ల ప్రభావం కనిపించింది. తదనంతరం వాతావరణం అనుకూలించడంతో ప్రస్తుతం వరిపంట రైతుల్లో ఆశలు రేకెత్తించింది. ఇటువంటి తరుణంలో తుఫాన్ రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. 1.50లక్షల ఎకరాల్లో వరి పంట ప్రస్తుతం చిరుపొట్ట, పొట్ట, ఈనిక, వరి కంకుల్లో గింజ గట్టి పడే దశల్లో ఉంది. గొల్లప్రోలు, పిఠాపురం, కొత్తపల్లి సహా మెట్ట మండలాల్లో ముందుగా వరినాట్లు పూర్తయిన పొలాల్లో వరిపంట గాలులు, వర్షాలు తాకిడికి పడిపోతున్నాయి. వర్షాలకు ఈనిక వచ్చిన పొలాల్లో గింజ పొల్లుబారి పోయే అవకాశం ఉందని, పంట దిగుబడులు గణనీయంగా తగ్గుతాయని రైతులు కలవరపడుతున్నారు. పంట ఆశాజనకంగా ఉందని భావిస్తున్న తరుణంలో తుఫాన్ హెచ్చరికలు, ఆపై వర్షంతో రైతులు తమ ఆశలు నీరుగారిపోతున్నాయని ఆవేదనకు గురవుతున్నారు. మెట్ట మినహా సామర్లకోట, కరప, కాజులూరు, తాళ్లరేవు, పెదపూడి, కాకినాడ రూరల్ తదితర మండలాల్లో వరి పంట పలుచోట్ల కోతకు సిద్ధంగా ఉంది. కానీ, కోత కోయడానికి రైతులు వెనుకాడుతున్నారు. కోయని వరిపంట పలుచోట్ల నేలనంటింది. వీటిపై వర్షాలు పడుతుండడంతో గింజ మొలకెత్తే ప్రమాదంఉంది.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

సాధారణంగా వర్షాలు కురుస్తున్నా, తుఫాన్ ప్రభావంతో భారీవర్షాలు కురిసే అవకాశం ఉండడంతో రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ఏ పరిస్థితుల్లోను పంటను కోయవద్దని తెలిపారు. గింజ మొలకెత్తే అవకాశం ఉన్నచోట్ల ఉప్పుద్రావణాన్ని పిచికారీ చేయాలన్నారు. అధిక వర్షాలు కురిసి వరదలు వచ్చి వరి పొలాలు ముంపునకు గురైతే ఎలుకల బెడద తీవ్రమయ్యే అవకాశం ఉంది. వీటి నివారణకు పొలం గట్లపై ఎకరానికి 20 బుట్టలు వంతున పెట్టాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. దానిలో ఎరగా బ్రోమోడయోలిన్ మందు ఉంచాలని తెలిపారు.

తుఫాన్‌తో వరి పంటకు భారీ నష్టం

- ముంపులో 2295 హెక్టార్ల పంట
- 87 గ్రామాల్లో పంటలపై ప్రభావం

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): తుఫాన్‌వల్ల వరిపంటలకు భారీగా నష్టం జరిగింది. జిల్లావ్యాప్తంగా 87 గ్రామాల్లో 2295 హెక్టార్లలో పంటలు ముంపులో ఉన్నాయి. దీని వల్ల 2,208 రైతులకు నష్టం వాటిల్లింది. ప్రధానంగా వరి పంట గింజ గట్టిపడే దశలో, పాలు పోసుకునే దశలో ఉంది. పంటలు ముంపులో ఉండడంతో అన్నదాత లబోదిబోమంటున్నారు. అత్యధికంగా సామర్లకోట మండలంలో 609 హెక్టార్లు, పెదపూడిలో 292 హెక్టార్లలో, తాళ్లరేవులో 138 హెక్టార్లలో, కాజులూరులో 178 హెక్టార్లలో, కరప 77 హెక్టార్లు, కిర్లంపూడి 32 హెక్టార్లు, కాకినాడ రూరల్ 196 హెక్టార్లు, పిఠాపురం 9 హెక్టార్లు, కాకినాడ అర్బన్ 48 హెక్టార్లు, ప్రత్తిపాడులో 16హెక్టార్లలో వరిపంట ముంపులో ఉంది. ఎడతెరిపి లేని వర్షాలకు వరిపంటకు తీవ్రనష్టం కల్గుతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో వ్యవసాయశాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

వరికోతలు వాయిదా వేయాలి

- వ్యవసాయశాఖ సీఎస్

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో భారీవర్షాలు కురుస్తున్నందున వరికోతలు వాయిదావేయాలని వ్యవసాయశాఖ స్పెషల్ సీఎస్ రాజశేఖర్ ఆదేశించారు. అమరావతి నుంచి సోమవారం ఆయన వ్యవసాయశాఖ జేడీ విజయ్‌కుమార్, ఇతర అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో తుఫాన్ ప్రభావం ఉన్నందున పొలాల్లో నీరు నిల్వ చర్యలు తీసుకోవాలన్నారు.

ఇంజనీర్ల పర్యవేక్షణలో విడుదల చేయాలి
-చినరాజప్ప, పెద్దాపురం ఎమ్మెల్యే

ఏలేరు రిజర్వాయర్‌నుంచి నీటిని విడుదల చేసే సమయంలో ఇంజనీర్ల పర్యవేక్షణలో నీటిని విడుదలచేయాలి. లష్కర్ల ఆధ్వర్యంలో నీటిని విడుదలతో మార్గమధ్యలో బ్రిడ్జిలు కొట్టుకుపోతున్నాయి.

ఏలేరు నీటిని ఒకేసారి వదలొద్దు
-ఎస్వీఎస్ఎన్ వర్మ, టీడీపీ పిఠాపురం ఇన్‌చార్జి

ఏలేరునుంచి నీటిని ఒకేసారి విడుదల చేయవద్దు. పిఠాపురం నియోజకవర్గానికి 2/3వ వంతు, పెద్దాపురం నియోజకవర్గానికి 1/3వవంతు చొప్పున విడుదలచేయాలి. ప్రధాన కాలువకు గండ్లు పడకుండా ఇసుక బస్తాలను పెద్దఎత్తున తరలించాలి. గొల్లప్రోలులోఉన్న ఎస్సీకాలనీ, ఉప్పాడలో ఉన్న సుబ్బంపేట, కొత్త మాయాపట్నం, పాతమాయాపట్నం, కోనపాపపేటల నుంచి బాధితులను బలవంతంగానైనా పునరావాస కేంద్రాలకు తరలించి సంరక్షణ కల్పించాలి.

'ఏలేరు' నుంచి 5వేల క్యూసెక్కుల నీరు విడుదల 7



కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం దుర్గాడలో ప్రత్యేక అలంకరణలో రామలింగేశ్వరస్వామి



కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం మురమళ్లలో వీరేశ్వరస్వామికి పంచామృతాభిషేకం

హరోం హర



పిఠాపురంలో



రాజమహేంద్రవరంలో...



కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం రాచపల్లిలో అరుణాచలేశ్వరస్వామికి లక్ష రుద్రాక్షలతో అలంకరణ

కార్తీక మాసం తొలి సోమవారం శైవ క్షేత్రాలు జనసంద్రమయ్యాయి. హరోంహర, ఓం నమశ్శివాయ అంటూ భక్తుల శివనామస్మరణతో మార్మోగాయి. ఎటుచూసినా పంచాక్షరీ నామం ప్రతిధ్వనించింది. తుఫాన్ హెచ్చరికలు వున్నా తెల్లవారుజామునే ఆలయాలకు విచ్చేసి పరమశివుడిని దర్శించుకుని అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. రాజమహేంద్రవరం పుష్కరాల రేవులో అధిక సంఖ్యలో భక్తులు పుణ్యస్నానాలు ఆరించారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని ప్రముఖ క్షేత్రాలైన పిఠాపురం పాదగయలో కుక్కుటేశ్వరస్వామికి, సామర్లకోట, ద్రాక్షారామల్లో భీమేశ్వరస్వామికి, మురమళ్లలో వీరేశ్వరస్వామికి, కోటిపల్లిలో సోమేశ్వరస్వామికి అర్చకులు పంచామృతాభిషేకాలు, విశేష అర్చనలు జరిపారు.



తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం పుష్కరాల రేవులో భక్తుల పుణ్యస్నానాలు



కుక్కుటేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న అర్చకులు

పిఠాపురం పాదగయకు పోటెత్తిన భక్తులు

పిఠాపురం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ క్షేత్రం భక్తజనసంద్రమైంది. కార్తీక మాసం మొదటి సోమవారం కావడంతో తెల్లవారు జామున రెండు గంటలకు ప్రారంభమైన భక్తుల రాక రాత్రి వరకు కొనసాగింది. పుష్కరిణిలో స్నానాలు ఆచరించిన భక్తులు కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్లను దర్శించుకుని పూజలు జరిపారు. ఉమాకుక్కుటేశ్వర స్వామికి అర్చకులు పంచామృత మహన్యాసపూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. సాయంత్రం వరకు ఉపవాసం ఉన్న మహిళలు ఆలయ ఆవరణలో దీపాలు వెలిగించి కార్తీక నోము ఆచరించారు. రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్లకు కుంకుమార్చన చేశారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఈవో కాట్నం జగన్మోహనశ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.



భీమేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న అర్చకులు

దక్షిణ కాశీ ద్రాక్షారామలో...

ద్రాక్షారామ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పంచామ క్షేత్రాల్లో ఒకటైన, దక్షిణ కాశీగా పేరొందిన ద్రాక్షారామ భీమేశ్వరస్వామికి అర్చకులు విశేష పూజలు జరిగాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు తరలివచ్చి భీమేశ్వరస్వామి, మాణిక్యాంబ అమ్మవార్లను దర్శించుకున్నారు. సామూహిక అభిషేకాల్లో పాల్గొన్నారు. ఆలయ సహాయ కమిషనరు అల్లు వెంకట దుర్గాభవాని ఆధ్వర్యంలో సిబ్బంది, సేవకులు భక్తులకు సేవలు అందించారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ భీమేశ్వరస్వామికి అభిషేకం, మాణిక్యాంబ అమ్మవారికి కుంకుమార్చన జరిపారు. ఆయనకు నంది మండపంలో వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చారు.



విద్యుద్దీపాలకాంతిలో కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ క్షేత్రం

సామర్లకోట భీమేశ్వర ఆలయంలో...



సామర్లకోట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పంచారామ క్షేత్రమైన సామర్లకోట కుమారరామ భీమేశ్వరస్వామి ఆలయానికి తెల్లవారుజామున ఐదు గంటల నుంచే అధిక సంఖ్యలో భక్తులు చేరుకున్నారు. గోపూజతో కార్తీక సోమవారం పూజలను ప్రారంభించారు. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులు భీమేశ్వరస్వామి, బాలాత్రిపురసుందరి అమ్మవార్లను దర్శించుకున్నారు. పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప కుటుంబ సమేతంగా విచ్చేసి స్వామికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన చేశారు.

మైనార్టీ యువతకు ఉద్యోగావకాశాలు

కార్పొరేషన్ (కాకినాడ), అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మైనార్టీ యువతకు జర్మనీలో ఎలక్ట్రిషియన్ ఉద్యోగం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఈడీ ఎం.సునీల్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి సంస్థ(ఏపీఎస్ఎస్‌డీసీ), ఓఎంసీఏపీ, ఐఈఎస్‌ల సహకారంతో జర్మనీలో ఎలక్ట్రిషియన్ ఉద్యోగాల కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఈడి తెలిపారు. ఆసక్తి గల మైనార్టీ అభ్యర్థులు http://naipunyam.ap.gov.in/user వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని కోరారు.

విద్యార్హతలు: ఐటీఐ(2 సంవత్సరాలు) లేదా డిప్లమా(3 సంవత్సరాలు), ఎలక్ట్రిషియన్ ట్రేడ్ పాస్ లేదా కనీసం 2 సంవత్సరాల అనుభవం కలిగి ఉండాలన్నారు. గరిష్ట వయస్సు 30 సంవత్సరాలు.

ఉద్యోగ వివరాలు: ఎలక్ట్రిషియన్ ఉద్యోగం కోసం పనిచేసే ప్రాంతం జర్మనీ. జీతం 2600 నుంచి 2700 యూరోలు(సుమారు రూ.2.60 లక్షల నుంచి రూ.2.70 లక్షలు). రెండు సంవత్సరాలు. ఒప్పందం ప్రకారం ఓవర్ టైమ్, అలవెన్సులు, వసతి, రాక సహాయం అందిస్తారు. గుర్తింపు, అనువాద ఖర్చులను యజమాని భరిస్తారని తెలిపారు. నవంబరు 2025 నుంచి 12-14 వారాలు జర్మన్ భాషా శిక్షణ ఉంటుందన్నారు. అప్లికేషన్ ఫీజు, శిక్షణ ఫీజుతో సహా రూ.1.15 లక్షలు అభ్యర్థి మూడు వాయిదాల్లో చెల్లించాలని తెలిపారు. అలాగే ఆహారం, వసతి, విమాన, వీసా చార్జీలు కూడా భరించాలన్నారు. కావాల్సిన పత్రాలు: పాస్ పోర్టు, మునుపటి కంపెనీ రిలీవింగ్ లెటర్, సంబంధిత విద్యార్హత సర్టిఫికెట్లు. అర్హులైన మైనార్టీ అభ్యర్థులు నవంబరు 2వతేదీ లోపు దరఖాస్తులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. అలాగే బయోడేటా వివరాలు స్కిల్ ఇంటర్నేషనల్ ఏపీఎస్ఎస్‌డీసీ డాట్ ఇన్‌కు పంపించాలని కోరారు. మరిన్ని వివరాలకు 99888 53335, 87126 55686, 87901 18349, 87901 17279 నెంబర్లను సంప్రదించాలని సునీల్‌కుమార్ పేర్కొన్నారు.

పిల్లా చంద్రానికి గౌరవ డాక్టరేట్



గౌరవ డాక్టరేట్ అందుకుంటున్న చంద్రం

గొల్లప్రోలు రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం కొడవలి గ్రామానికి చెందిన ఆల్ ఇండియా పాఠశాలల పేరెంట్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పిల్లా చంద్రం డాక్టరేట్ అందుకున్నారు. నీతి ఆయోగ్ ద్వారా గుర్తింపు పొందిన ఆసియా అంతర్జాతీయ సంస్కృతి పరిశోధనా విశ్వవిద్యాలయం ప్రతినిధులు కర్నాటక రాష్ట్రంలోని హోసూరులో జరిగిన కార్యక్రమంలో చంద్రానికి గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లోని మూడు వేల ప్రభుత్వ, గురుకుల పాఠశాలలను పేరెంట్స్ అసోసియేషన్ తరపున సందర్శిస్తూ చేపట్టిన కార్యక్రమాలకు గుర్తింపుగా ఈ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా చంద్రానికి పలువురు అభినందనలు తెలిపారు.

గోదావరి స్నానాల ఘాట్లు మూసివేత

రాజమహేంద్రవరం మునిసిపల్ కమిషనర్ రాహుల్‌మీనా



గోదావరి రేవులను పరిశీలించి సూచనలు చేస్తున్న కమిషనర్ రాహుల్ మీనా

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో రాజమహేంద్రవరంలోని గోదావరి ఘాట్లను మూసివేసినట్టు మునిసిపల్ కమిషనర్ రాహుల్‌మీనా తెలిపారు. సోమవారం రాజమహేంద్రవరంలో పుష్కరఘాట్, లక్ష్మీగణపతి ఘాట్‌లను పరిశీలించారు. నదిలోని నీటిప్రవాహం చూసి కట్టుదిట్టమైన భద్రత చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఘాట్లలోకి స్నానాలకు వెళ్లకుండా నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. తుఫాన్ కారణంగా ఘాట్‌లు ప్రమాదకరంగా మారడంతో వాటిని తాత్కాలికంగా మూసివేసినట్టు వెల్లడించారు. భక్తులు, ప్రజలు గోదావరి ఘాట్లకు వెళ్లవద్దని సూచించారు. ఈ సందర్భంగా కమిషనర్ వెంట నగర ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వినూత్న, ఎస్ఈ ఇన్‌చార్జి రీటా, ఈఈ మాధవి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ యూనివర్శిటీ మహిళ

కబడ్డీ పోటీలకు నన్నయ విద్యార్థుల ఎంపిక



పోటీలకు ఎంపికైన నన్నయ విశ్వవిద్యాలయం కబడ్డీ జట్టు సభ్యులతో రిజిస్ట్రార్ స్వామి

దివాన్‌చెరువు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్శిటీ మహిళా కబడ్డీ పోటీలకు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం విద్యార్థులు ఎంపికయ్యారని రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి తెలిపారు. విశ్వవిద్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.. తమిళనాడు సేలంలో వినాయక మిషన్ రీసెర్చ్ ఫౌండేషన్‌లో ఈ నెల 29 నుంచి వచ్చేనెల 2వ తేదీ వరకూ జరిగే దక్షిణ మండల అంతర్ విశ్వవిద్యాలయాల మహిళా కబడ్డీ పోటీలకు నన్నయ విద్యార్థులు ఎంపికయ్యారని చెప్పారు. గొల్లల మామిడాడలోని డీఆర్‌కే రెడ్డి వ్యాయామ విద్య కళాశాలలో జరిగిన అంతర్ కళాశాలల పోటీల్లో ప్రతిభ కనబరచిన 14 మంది క్రీడాకారులకు ఐదురోజులు కోచింగ్ క్యాంప్ నిర్వహించి జట్టును ఎంపిక చేశారన్నారు. వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం అధ్యాపకులు ఆచార్య డి.జ్యోతిర్మయి, పి.వెంకటేశ్వరరావు, ఎ.మట్టారెడ్డి, క్రీడా బోర్డు సహాయ కార్యదర్శి ఎంవీఎస్ఎస్ఎన్ మూర్తి, కోచ్, పీవీవీ లక్ష్మి, మేనేజర్ కె.లోవరాజు పాల్గొన్నారు.

అంతర్ జిల్లా దొంగల ముఠా అరెస్టు

186 గ్రాములు బంగారం, 263 గ్రాముల వెండి స్వాధీనం



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ శ్రీనివాసరావు

శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని శ్రీకాకుళం రూరల్, గార పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆరు ఇళ్లల్లో జరిగిన దొంగతనం కేసుల్లో 186 గ్రాముల బంగారం, 263 గ్రాముల వెండి ఆభరణాలను పోలీసులు రికవరీ చేశారు. అంతర్ జిల్లాకు చెందిన ముగ్గురిని అరెస్టు చేశారు. ఏఎస్పీ(క్రైం) పి.శ్రీనివాసరావు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను వెల్లడించారు. 'శ్రీకాకుళం మండలం నందగిరిపేటలో 2, రాగోలులో 1,గార మండలం కె.మత్స్యలేశంలోని 3 దొంగతనాల కేసులు ఇటీవల నమోదయ్యాయి. కాకినాడకు చెందిన రేకడి వెంకటేశ్వర్లు, ధర్మాది ప్రసాద్, మాడెం మోహన్‌కుమార్ ఈ చోరీలకు పాల్పడినట్టు దర్యాప్తులో తేలింది. వారిని శ్రీకాకుళం మండలం తండ్యేంవలసలో సోమవారం అరెస్టు చేశాం. వారి నుంచి చోరీకి గురైన 186 గ్రాముల బంగారం, 263 గ్రాముల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నాం. ఈ ముగ్గురూ కాకినాడ సబ్‌జైల్లో ఉన్నప్పుడు స్నేహితులయ్యారు. చోరీలను వృత్తిగా మార్చుకున్నారు. ఒక్కొక్కరిపై సుమారు 25 కేసులు ఉన్నాయి అని ఏఎస్పీ తెలిపారు. అలాగే దూసి గ్రామంలో రూ.3లక్షల నగదు, 8 తులాల బంగారం పోయిందని తప్పుడు ఫిర్యాదు ఇచ్చిన వ్యక్తి ఇంట్లో ఎటువంటి చోరీ జరగలేదన్నారు. తప్పుడు ఫిర్యాదు ఇచ్చిన వ్యక్తిపై కూడా కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

ఆలిండియా సివిల్ సర్వీసెస్ జిల్లా స్థాయి ఎంపికలు వాయిదా

కార్పొరేషన్ (కాకినాడ), అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుపాన్ ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలను దృష్టిలో పెట్టుకుని ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ రాష్ట్ర స్థాయి ఎంపికలను వాయిదా వేసింది. ఈ మేరకు కొత్త తేదీలను త్వరలో ప్రకటించనున్నట్టు అధికారులు తెలిపారు. జిల్లా స్థాయిలో కూడా వాతావరణ హెచ్చరికలను పరిగణలోకి తీసుకుని కాకినాడ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 29న జరగాల్సిన ఆలిండియా సివిల్ సర్వీసెస్ జిల్లా స్థాయి ఎంపికలు వాయిదా వేసినట్టు అధికారులు ప్రకటించారు. కొత్త తేదీలను నిర్ణయించి అనంతరం సమాచారం అందించనున్నట్టు పేర్కొన్నారు.

పాదగయలో ముమ్మిడివరం ఎమ్మెల్యే పూజలు



ఎమ్మెల్యే సుబ్బరాజుకు స్వామి, అమ్మవార్ల చిత్రపటం అందజేస్తున్న ఈవో జగన్మోహన శ్రీనివాస్

పిఠాపురం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ క్షేత్రానికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు సోమవారం విచ్చేశారు. కుటుంబసభ్యులతో కలిసి కుక్కుటేశ్వరస్వామి దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్లను దర్శించుకుని పూజలు జరిపారు. ఆలయ పండితులు క్షేత్ర ప్రాశస్త్యం వివరించి ఆశీర్వచనాలు అందించారు. ఎమ్మెల్యే దంపతులను ఈవో జగన్మోహన శ్రీనివాస్ శేషవస్త్రాలతో సత్కరించి ప్రసాదం, స్వామి,అమ్మవార్ల చిత్రపటం అందజేశారు. పండితులు వింజమూరి సుబ్రహ్మణ్యశర్మ, అల్లంరాజు చంద్రమౌళి, సూపరింటెండెంట్ బొల్లం వీరభద్రరావు, రెడ్నం ప్రసాద్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ దత్తాత్రేయ పాల్గొన్నారు.

భీమేశ్వరాలయంలో ఎమ్మెల్యే చినరాజప్ప పూజలు



భీమేశ్వరస్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే చినరాజప్ప


సామర్లకోట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం మొదటి సోమవారం కాకినాడ జిల్లా సామర్లకోటలోని కుమారరామ భీమేశ్వరాలయాన్ని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప కుటుంబ సమేతంగా సందర్శించారు. భార్య అనురాధ, కుమారుడు రంగనాగ్, కోడలు సృజన, మనుమలతో కలిసి ఆలయానికి వచ్చిన ఆయనకు ఈవో బళ్ల నీలకంఠం, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కంటే జగదీష్‌మోహన్(బాబు) ఆధ్వర్యంలో వేదపండితులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. భీమేశ్వరునికి అభిషేకాలు, బాలాత్రిపురసుందరి అమ్మవారికి కుంకుమార్చన చేశారు. అనంతరం ఎమ్మెల్యే కుటుంబీకులకు నంది మండపం వద్ద పండితులు వేదాశీర్వచనం, ప్రసాదాలు అందజేశారు.

పలు రైళ్లు రద్దు

భీమవరం క్రైం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను నేపథ్యంలో పశ్చిమ గోదావరి జిల్లా మీదుగా వెళ్లే పలు రైళ్లను రద్దు చేశారు. సోమవారం విశాఖ-ఎల్‌టీటీ(18519), మంగళవారం ఎల్‌టీటీ-విశాఖ(18520) ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేసినట్టు భీమవరం జంక్షన్ రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ చక్రవర్తి తెలిపారు. 28న విజయవాడ-భీమవరం(67281),భీమవరం-విజయవాడ(67282), భీమవరం-నిడదవోలు(67283), నిడదవోలు-భీమవరం(67284), నరసాపురం-నిడదవోలు(67244), నిడదవోలు-నరసాపురం(67245), నరసాపురం-రాజమండ్రి (67246), నరసాపురం-విజయవాడ(67276), భీమవరం-నిడదవోలు(67277), నిడదవోలు-భీమవరం(67278), నరసాపురం-గుంటూరు(67247), విజయవాడ-నరసాపురం(67257), రాజమండ్రి-భీమవరం(67241), 29న భీమవరం-నిడదవోలు(67242), నిడదవోలు-నరసాపురం(67243), నరసాపురం-నిడదవోలు(67244), నిడదవోలు-నరసాపురం(67245), భీమవరం-నరసాపురం(17263) రైళ్లను రద్దు చేసినట్టు సూపరింటెండెంట్ చక్రవర్తి పేర్కొన్నారు.

హ్యూమన్‌రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్

సౌత్ ఇండియా చైర్మన్‌గా కృష్ణమూర్తి



కృష్ణమూర్తికి నియామకపత్రం అందజేస్తున్న నేషనల్ చైర్మన్ ప్రసన్నకుమార్

కాకినాడ సిటీ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ సౌత్ ఇండియా చైర్మన్‌గా లయన్స్ క్లబ్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ లింగమల్లు కృష్ణమూర్తి నియమితులయ్యారు. ఆయనకు నేషనల్ చైర్మన్ తాళ్లూరి ప్రసన్నకుమార్ నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు. కాకినాడలోని కాస్మోపాలిటన్ క్లబ్ హాలులో జరిగిన కార్యక్రమంలో కౌన్సిల్ సౌత్ ఇండియా చైర్మన్ బీఎస్ కృష్ణ, ఏపీ ఎస్సీ సెల్ చైర్‌పర్సన్ బొల్లిపల్లి జోసీకుమారి తదితరులు పాల్గొన్నారు.

మొంథా.. ముందుగానే నీటి విడుదల!

● తుఫాన్ కారణంగా భారీ వర్ష సూచన

● ఏలేరు రిజర్వాయర్ నుంచి 5వేల క్యూసెక్కుల నీరు విడుదల

ఏలేశ్వరం/పిఠాపురం/గొల్లప్రోలు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ఏలేరు రిజర్వాయర్ నుంచి నీటి విడుదలను సోమవారం సాయంత్రం 6గంటలు నుంచి 5వేల క్యూసెక్కులకు పెంచారు. ఇన్‌ఫ్లోస్ సాధారణంగా ఉన్నప్పటికి మొంథా తుఫాన్ కారణంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న సమాచారంతో దిగువకు నీటిని అధికంగా విడుదల చేస్తున్నారు. ఏలేరు రిజర్వాయర్ నుంచి సోమవారం ఉదయం 6గంటలకు వరకూ 3175 క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా, 500 క్యూసెక్కుల వంతున పెంచుకుంటూ సాయంత్రానికి 5,175 క్యూసెక్కులకు పెంచారు. స్పిల్‌వే ద్వారా 4,400 క్యూసెక్కులు, డీసీఆర్ స్లూయిజ్ ద్వారా 600 క్యూసెక్కులు వెరసి 5వేల క్యూసెక్కులకు కాలువలకు విడుదల చేస్తున్నారు. విశాఖ అవసరాల నిమిత్తం 175 క్యూసెక్కుల నీటిని పంపుతున్నారు. ఇన్ ఫ్లోస్ 1700 క్యూసెక్కులు మాత్రమే ఉన్నాయి. ఇన్‌ఫ్లోస్ కంటే మూడు రెట్లు అధికంగా అవుట్‌ఫ్లోస్ ఉండడంతో ఏలేరు రిజర్వాయర్‌లో నీటి నిల్వలు 21.90 టీఎంసీలకు తగ్గగా, నీటిమట్టం 85.47మీటర్లుగా ఉంది. తుఫాన్ ప్రభావంతో క్యాచ్‌మెంట్ ఏరియాలో అతి భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేస్తున్నారు. దీంతో ఇన్‌ఫ్లోస్ భారీగా పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. దీంతో అవుట్‌ఫ్లోస్ పెంచినట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

అత్యంత అప్రమత్తం

ఏలేరు నుంచి 5వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండడంతో గొల్లప్రోలు, పిఠాపురం, కొత్తపల్లి, కిర్లంపూడి, పెద్దాపురం, సామర్లకోట, ప్రత్తిపాడు, ఏలేశ్వరం తదితర మండలాల్లో ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ అయ్యాయి. దీనికి అనుగుణంగా రెవెన్యూ అధికారులు గ్రామాల్లో పర్యటించి ప్రజలకు సమాచారం ఇస్తున్నారు.



డొంకరాయి జలాశయం నుంచి నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

డొంకరాయి జలాశయం నుంచి 15 వేల క్యూసెక్కులు..

మోతుగూడెం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): సీలేరు కాంప్లెక్సు పరిధిలోని డొంకరాయి జలాశయం నుంచి 15వేల క్యూసెక్కుల నీటిని జెన్‌కో అధికారులు సోమవారం విడుదల చేశారు. మొంథా తుఫాన్‌లో భాగంగా ముందు జాగ్రత్త చర్యగా డ్యాం సేఫ్టీ అధికార్ల ఆదేశాల మేరకు జలాశయం నుంచి నీటిని విడుదల చేస్తున్నట్లు సీలేరు కాంప్లెక్సు ఏపీ జెన్‌కో సీఈ రాజారావు తెలిపారు. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 1037 అడుగులు కాగా ఇటీవల ఈ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు ఎగువ ప్రాంతంలో ఉన్న వలస గెడ్డ, పాలగెడ్డ, మంగంపాడు తదితర చోట్ల నుంచి భారీగా వరద నీరు వచ్చి జలాశయంలోకి రావడంతో నీటి మట్టం 1036.50 అడుగులకు చేరుకుంది. నీటి మట్టాన్ని తగ్గించే చర్యల్లో భాగంగానే 15వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నామన్నారు. ప్రస్తుతం జలాశయానికి 10 వేల నుంచి 12వేలు క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నాయని, నీటి విడుదల నేపథ్యంలో జలాశయం దిగువున ఉన్న ప్రజలను అప్రమత్తం చేశామన్నారు. కాంప్లెక్సు పరిధిలోని జోలాపుట్, సీలేరు జలాశయాల వద్ద కూడా జెన్‌కో అధికారులను అప్రమత్తం చేసి ఎప్పటికప్పుడు వరద నీటిని పర్యవేక్షించి చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశామని తెలిపారు.





ఏలేరు జలాశయంలో నీటి నిల్వలు, పిఠాపురం-గొల్లప్రోలు మధ్య ఏలేరు ప్రవాహ ఉధృతి

పంపా, తాండవ నుంచి కూడా...

అన్నవరం/కోటనందూరు అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): అన్నవరంలో పంపా రిజర్వాయర్‌లో నీటిమట్టం నిలకడగా ఉంది. తుఫాన్ నేపథ్యంలో అధికారులు రిజర్వాయిర్ వద్ద ఉండి పర్యవేక్షణ చేస్తున్నారు. ప్రస్తుతం 99 అడుగులు నీటిమట్టం ఉందని, ఇన్‌ఫ్లో 700 క్యూ సెక్కులు వస్తుండగా 650 క్యూసెక్కుల నీటిని పంట, వరద కాలువల ద్వారా బయటకు పంపిస్తున్నారు. అలాగే తాండవ రిజర్వాయర్ నుంచి 310 క్యూసెక్కుల నీటిని విడుదల చేశామని డీఈ అనురాధ తెలిపారు.



అన్నవరం పంపా రిజర్వాయర్‌లో నీరు

తుఫాన్ హెచ్చరికలు..
రత్నగిరిపై భక్తుల రక్షణకు చర్యలు

అన్నవరం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో బలమైన ఈదురు గాలులు వీస్తాయని వాతావరణ శాఖ సూచనలతో అన్నవరం దేవస్థానం అధికారులు అప్రమత్తమయ్యారు. కార్తీకమాసం సందర్భంగా భక్తులకు ఎండా, వానల నుంచి రక్షణగా పలు కూడళ్లలో రేకులషెడ్డులు వేసి క్లాత్ డెకరేట్ చేశారు. అయితే అవి గాలులకు ఎగిరిపోకుండా పటిష్టమైన తాళ్లతో బిగించి జాగ్రత్తలు తీసుకున్నారు. భక్తులు ఎక్కడా ఎక్కువసేపు నిల్చోవద్దని మైక్ ద్వారా ప్రచారం గావించారు. దర్శనాలు, వ్రతాలు పూర్తయిన వారు తమ స్వస్థలాలకు వెళ్లిపోవాలంటూ ప్రచారం చేశారు.



భక్తులకు రక్షణగా ఏర్పాటు చేసిన రేకులను పటిష్టం చేస్తున్న అధికారులు

తగ్గిన భక్తుల తాకిడి

అన్నవరం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావం సత్యదేవుడి ఆలయంపై పడింది. కార్తీకమాసం సోమవారం పర్వదినమైనా భక్తులు సందడి పెద్దగా కనిపించలేదు. ఉదయం 10గంటలకే ఆలయప్రాంగణం ఖాళీ అయిపోయింది. సోమవారం సుమారు 4వేల వ్రతాలు జరుగుతాయని అధికారులు అంచనా వేసినా కేవలం 2వేలు మాత్రమే జరిగాయి. కార్తీకమాసం ప్రత్యేక అధికారులుగా నియమించిన డిప్యూటీ కమిషనర్ రమేష్‌బాబు, తలుపులమ్మ ఆలయ ఈవో విశ్వనాథరాజు, చైర్మన్ రోహిత్‌లు కమాండ్ కంట్రోల్ రూం నుంచి క్యూలైన్‌లు, రద్దీ నియంత్రణకు తీసుకోవలసిన చర్యలపై చర్చించారు. దేవస్థానం ఈవో సుబ్బారావు ప్రధానాలయం, ఇతర ప్రాంతాల్లో పర్యటించారు.



భక్తులు లేక వెలవెలబోతున్న సత్యదేవుడి ఆలయ ప్రాంగణం

కాకినాడ జీజీహెచ్‌లో ప్రత్యేక వార్డు ఏర్పాటు



ఏర్పాటు చేసిన ప్రత్యేక వార్డు

జీజీహెచ్ (కాకినాడ), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా కాకినాడ జీజీహెచ్‌లో ప్రత్యేక వార్డు ఏర్పాటు చేశారు. ఫిమేల్ ఆర్థో వార్డులో 49 పడకల సామర్థ్యంతో తుఫాను ప్రభావంతో ప్రమాదాలు జరిగితే ఈ వార్డును వినియోగించేందుకు ఏర్పాటు చేశారు. అన్ని మౌలిక సదుపాయాలు, ప్రత్యేక వైద్య బృందం, నిరంతరప్రాయంగా వైద్య సేవలు అందించేందుకు పలు విభాగాల వైద్య నిపుణులు, వైద్యేతర సిబ్బంది విధులు నిర్వర్తించే విధంగా జీజీహెచ్ ఆసుపత్రి అధికారులు చర్యలు చేపట్టారు.

ఇంటర్ పరీక్ష ఫీజు 31 లోపు చెల్లించాలి

జరిమానాతో వచ్చే నెల 6 వరకూ అవకాశం

రాజమహేంద్రవరం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): వచ్చేఏడాది మార్చిలో నిర్వహించే ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే జనరల్, ఒకేషనల్.. రెగ్యులర్, ఫెయిల్ అయిన విద్యార్థులు ఈ నెల 31లోపుగా పరీక్ష ఫీజును చెల్లించాలని తూర్పుగోదావరి జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి ఎన్ఎస్‌వీఎల్.నరసింహం తెలిపారు. రూ.వెయ్యి జరిమానాతో నవంబరు 6 వరకూ చెల్లించవచ్చని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులను అన్ని కళాశాలల ప్రిన్సిపాల్స్‌కి తెలియజేశామన్నారు. విద్యార్థులు గడువు లోపు పరీక్ష రుసుం చెల్లించాలని సూచించారు.

నిబంధనలు పాటించని 3 బస్సుల సీజ్

20 బస్సులకు జరిమానా

ముమ్మిడివరం/రావులపాలెం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మోటారు వాహనాల చట్టం ఉల్లంఘన కింద 2 ప్రయివేటు ట్రావెల్ బస్సులను సీజ్ చేసి మరో 9 బస్సులపై కేసులు నమోదు చేసి జరిమానా విధించినట్లు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రవాణా అధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. ముమ్మిడివరం మండలం అన్నంపల్ల టోల్ ప్లాజా వద్ద నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో 11 ప్రయివేటు ట్రావెలర్ బస్సులపై కేసులు నమోదు చేశామన్నారు. వీటిలో మోటారు వాహనాల చట్టం ఉల్లంఘన కింద 2 బస్సులను సీజ్ చేసి, మరో 9 బస్సులపై ఇతర కేసులు నమోదు చేసి రూ.18 వేలు అపరాధ రుసుం విధించినట్లు తెలిపారు. సీజ్ చేసిన 2 బస్సుల్లో నిబంధనలు పాటించకుండా అనాధికారికంగా సీట్లు మార్పు చేసినట్లు గుర్తించామని వీటిని ముమ్మిడివరం పోలీస్‌స్టేషన్ అప్పగించామని తెలిపారు. అలాగే రావులపాలెం జాతీయ రహదారిపై తనిఖీ చేసి సిరి ట్రావెల్స్‌కు చెందిన ఓ బస్సును సీజ్ చేయడంతో పాటు 11 బస్సులపై రూ.32వేల ఫైన్ విధించినట్లు ఆయన చెప్పారు.



బస్సులను తనిఖీ చేస్తున్న కోనసీమ జిల్లా రవాణా అధికారి



బోటు.. ట్రాన్స్‌పోర్టు!

కాకినాడ జిల్లా ఉప్పాడ సముద్రతీరం నుంచి పిఠాపురం మీదుగా ఓ బోట్‌ను వ్యాన్‌పై కాకినాడ సమీపంలో తుఫాన్ ముంపు ప్రమాదం పొంచి ఉన్న ప్రాంతాలకు సోమవారం తరలిస్తుండగా ఆంధ్రజ్యోతి క్లిక్ మనిపించింది.



కాకినాడ జిల్లా తొండంగిలో ఎక్స్‌కవేటర్ సహాయంతో బోటును ఒడ్డు నుంచి సురక్షిత ప్రాంతానికి తరలిస్తున్న మత్స్యకారులు

తుఫాన్ ఎఫెక్ట్
పలు రైళ్లు రద్దు

రైల్వే స్టేషన్లలో ప్రత్యేక హెల్ప్‌లైన్‌లు

రైల్వే యంత్రాంగం జాగ్రత్త చర్యలు

సామర్లకోట/ రాజమహేంద్రవరం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను ఈదురు గాలులు, భారీవర్షాల కారణంగా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా విశాఖ నుంచి సామర్లకోట మీదుగా రాకపోకలు సాగించే పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లను 3రోజుల బాటు తాత్కాలికంగా రద్దు చేసినట్లు రైల్వే ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. రైళ్ల రద్దు, ఆలస్యం, రిజర్వేషన్ టిక్కెట్ల విషయాలు ప్రయాణికులు తెలుసుకునేందుకు విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో 9 హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేశామన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని సామర్లకోట రైల్వే స్టేషన్‌తో సహా రాజమహేంద్రవరం, కాకినాడ టౌన్ స్టేషన్లలో ప్రత్యేక హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటుచేసి నిరంతరం సమాచారాన్ని అందివ్వనున్నట్టు తెలిపారు. సామర్లకోట రైల్వే స్టేషన్‌లో 7382383188, రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌లో 8331987657, కాకినాడ టౌన్ రైల్వే స్టేషన్‌లో 0884-2374227 నంబర్లకు ఫోన్ చేసి రైల్వే సమాచారాన్ని తెలుసుకోవచ్చని రైల్వే సూపరింటెండెంట్ ఎం.రమేష్ తెలిపారు.

రద్దయిన రైళ్లు ఇవే

విశాఖ-విజయవాడ మధ్య సామర్లకోట స్టేషన్‌మీదుగా రాకపోకలు సాగించే పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేసినట్లు ఈస్ట్‌కోస్ట్ రైల్వే అధికారులు సోమవారం రాత్రి తెలిపారు. ఈ నెల 28 మంగళవారం రైలు నెం.67285, 67286 రాజమండ్రి-విశాఖ-రాజమండ్రి మెము, 17268, 17267 విశాఖ-కాకినాడ-విశాఖ, 08583/84 విశాఖ-తిరుపతి-విశాఖ, 22875/76 విశాఖ-గుంటూరు-విశాఖ డబుల్ డెకర్, 22707 విశాఖ-తిరుపతి డబుల్ డెకర్, 17243/44 గుంటూరు-రాయగడ-గుంటూరు, 17220 విశాఖ- మచిలీపట్నం, 12727 విశాఖ-హైదరాబాద్, 12861 విశాఖ-మహబూబ్‌నగర్, 12862 మహబూబ్‌నగర్-విశాఖ(28న), 22869 విశాఖ- చెన్నై వీక్లీ, 12739న విశాఖ-సికింద్రాబాద్, 20805 విశాఖ-ఢిల్లీ ఏపీ ఎక్స్‌ప్రెస్, 22707 విశాఖ-తిరుపతి వీక్లీ డబుల్ డెకర్, 18519 విశాఖ-ముంబై ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్‌లను రానుపోను రైళ్లను రద్దు చేశారు.

14 రైళ్లు పునరుద్ధరణ

తుఫాను కారణంగా విజయవాడ రైల్వే ఉన్నతాధికారులు 14 రైళ్లను రద్దు చేసినట్లు ప్రకటించినప్పటికీ సోమవారం పునరుద్ధరించినట్లు రైల్వే డిప్యూటీ సీవోఎం సందీప్‌కుమార్ సోమవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. 08583 విశాఖ- తిరుపతి, 22707 విశాఖ-తిరుపతి డబుల్ డెక్కర్, 17243 గుంటూరు-రాయగడ, 17244 రాయగడ-గుంటూరు, 17220 విశాఖ-మచిలీపట్నం, 12727 విశాఖ- హైదరాబాద్, 12861 విశాఖ- మహబూబ్‌నగర్, 22869 విశాఖ-మద్రాసు వారాంతపు ఎక్స్‌ప్రెస్, 12739 విశాఖ-సికింద్రాబాద్, 20805 విశాఖ-న్యూఢిల్లీ, 22707 విశాఖ-తిరుపతి వారాంతపు డబుల్ డెక్కర్, 18519 నంబరు గల విశాఖ-ఎల్టీటీ రైళ్లు పునరుద్ధరించిన వాటిలో ఉన్నట్టు పేర్కొన్నారు. 20806 నంబరు గల న్యూఢిల్లీ-విశాఖ, 18520 నంబరు గల ఎల్టీటీ-విశాఖ ఎక్స్‌ప్రెస్ రైళ్ళు ఈనెల29న యథావిధిగా బయలుదేరనున్నాయి.

పర్ర కాలువలో పడి బాలుడు గల్లంతు

కాకినాడ రూరల్ మండలం సూర్యారావుపేటలో ఘటన

గాలింపు చర్యలు చేపట్టిన ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం



చరణ్‌సాయి(ఫైల్),



గాలిస్తున్న ఏపీ ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం

సర్పవరం జంక్షన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం సూర్యారావుపేట పర్ర కాలువలో పడి 11 ఏళ్ల బాలుడు గల్లంతైన ఘటన సోమవారం ఉదయం 11 గంటలకు జరిగింది. కాకినాడ మధురానగర్‌కి చెందిన పోలవరపు రమణ, దుర్గాభవానీ భార్యభర్తలు. కూలీ పనుల జీవనోపాధి కోసం తుని నుంచి 6నెలల కిందట మధురానగర్ వచ్చి నివాసం ఉంటున్నారు. వారికి కొడుకు చరణ్ సాయి రిత్విక్ (11) ఉన్నాడు. స్థానికంగా ప్రైవేట్ పాఠశాల్లో 6వ తరగతి చదువుతున్నాడు. తుఫాన్ కారణంగా పాఠశాలలకు సోమవారం నుంచి సెలవులు ఇవ్వడంతో ఆర్టీవో ఆఫీసు రోడ్డులో నివాసం ఉంటున్న మేనమావయ్య కొప్పిశెట్టి శ్రీనివాస్ ఇంటికి వెళ్తానని తల్లిదండ్రులకు చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. అక్కడ నుంచి నేమాంలో ఉన్న అమ్మమ్మ ఇంటికి శ్రీనివాస్ బైక్‌పై చరణ్ సాయి రిత్విక్ ఇద్దరూ బయలుదేరారు. బీచ్‌రోడ్డులో రాకపోకలు నిషేధించడంతో సూర్యారావుపేట గ్రామం నుంచి పర్ర కాలువ మీదుగా వెళుతున్నారు. ఈ క్రమంలో పర్ర కాలువ కాజ్‌వై పైనుంచి ప్రవహిస్తోన్న వరద నీటిపై నుంచి వెళ్తుండగా అప్రోచ్ వద్ద ఉన్న నీటితో నిండిన గోతిలో బైక్ పడింది. బాలుడు బ్రిడ్జి అంచున పడడంతో పైకి లేపేలోపు నాకు ఈత వచ్చంటూ పర్ర కాలువలోకి దూకేశాడని మేనమామ శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశాడు. నీరు ప్రవాహం ఉధృతిగా ఉందని, వెంటనే బయటకు వచ్చేయి అని చెప్పగా, అప్పటికే కొద్దిదూరం ఈదుకుంటూ వెళ్లిన చరణ్‌సాయి రుత్విక్ వెనక్కి వస్తున్న క్రమంలో నీటి ప్రవాహానికి కొట్టుకుపోయినట్టు శ్రీనివాస్ చెప్పినట్టు కాకినాడ రూరల్ సీఐ డీఎస్ చైతన్యకృష్ణ తెలిపారు. ఎమ్మెల్యే పంతం నానాజీకి బాలుడు గల్లంతు సమాచారం తెలియడంతో పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడి ఏపీ ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం, గజ ఈతగాళ్లను రప్పించి గాలింపు చర్యలు చేపట్టారు. బాలుడ్ని రక్షించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. సంఘటనా ప్రదేశం వద్ద తహశీల్దారు వీ.కుమారి, కాకినాడ రూరల్ సీఐ చైతన్యకృష్ణ ఆధ్వర్యంలో తిమ్మాపురం ఎస్ఐ వై.గణేష్‌కుమార్ సిబ్బందితో గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. వీఆర్వో చిన్న ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నామని, మంగళవారం ఉదయం గాలింపు కొన సాగిస్తామన్నారు. రహదారిలో రాకపోకలు నిషేధిస్తూ కాజ్‌వేకు అడ్డంగా పెద్ద దుంగలు పెట్టినా వీటిని పక్కకు తోసేసి బైక్‌పై వెళ్లడం జరిగిందన్నారు.

ఒడిశా కార్మికుడి అనుమానాస్పద మృతి

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం జీజీహెచ్ సమీపంలో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ మెడికల్ కాలేజీ నూతన భవనంలో ఒడిశాకు చెందిన కెసాబా పోడే (49) అనే కార్మికుడు అనుమానాస్పద రీతిలో మృతి చెందిన సంఘటన సోమవారం వెలుగు చూసింది. లిఫ్టు నిర్మాణ ప్రదేశంలో మృతదేహం కుళ్లిపోయి గుర్తుపట్టలేని స్థితిలో ఉండడంతో పాటు శరీరంలోని కొన్ని అవయవాలు కనిపించకపోవడంతో కొన్ని రోజుల క్రితమే మృతిచెంది ఉంటాడని భావిస్తున్నారు. కెసాబా పోడే పది రోజుల క్రితమే ఒడిశా నుంచి ఇక్కడికి పనికి వచ్చినట్టు చెప్తున్నారు. పోలీసులు సంఘటనా ప్రదేశాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేశారు. కాగా మెడికల్ కాలేజీ భవన నిర్మాణంలో వర్క్ సైట్ మేనేజర్‌తోపాటు వివిధ హోదాల్లో సూపర్‌వైజర్లు, మేస్త్రీ తదితరులు పనులు పర్యవేక్షిస్తుంటారు. ఇలాంటి పరిస్థితుల్లో కార్మికుడు ఒకరు అదృశ్యమైనా పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడంపై సహచర కార్మికుల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మరోపక్క నిర్మాణ పనులు పర్యవేక్షించే ఏపీఎస్ఎంఐడీసీ అధికారులకు దీని గురించి తెలియదా ? లేక తెలిసీ నిర్లక్ష్యం చూపించారా అనే ఆరోపణలు వస్తున్నాయి.



కెసాబా పోడే (ఫైల్)

లారీ బోల్తా : డ్రైవర్‌కు తీవ్రగాయాలు

కొవ్వూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): లారీ బోల్తా పడి డ్రైవర్‌కు తీవ్రగాయాలైన సంఘటన తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం కాపవరం హైవేపై జరిగింది. నల్లగొండ నుంచి కాకినాడ వైపు సోనా మసూర్ బియ్యం లోడ్‌తో వెళ్తున్న 16 చక్రాల లారీ ఎడమవైపునకు రోడ్డుపై అడ్డంగా బోల్తా పడింది. నల్లగొండ జిల్లా దేవరకొండ గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ పిల్లి శ్రీను తలకు తీవ్రగాయాలు కావడంతో 108 అంబులెన్స్‌లో కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాదంతో హైవేపై ట్రాఫిక్ నిలిచిపోయింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. దీనిపై ఇప్పటివరకు ఎటువంటి కేసు నమోదు కాలేదు.



కాపవరం హైవేపై బోల్తా పడిన లారీ

మారణాయుధాలు చూపి దోపిడీకి యత్నం

ముగ్గురు యువకుల అరెస్ట్



నిందితులతో గోకవరం పోలీసులు

గోకవరం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మారణాయుధాలు చూపించి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న ముగ్గురు యువకులను సోమవారం అరెస్ట్ చేసినట్టు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా గోకవరం గ్రామానికి చెందిన నల్లంశెట్టి రాజేష్, లింగంపల్లి శివ, తుమ్మల అరవింద్ కలిసి ప్రజలను మారణాయుధాలతో బెదిరించి దారి దోపిడీకి యత్నిస్తున్నట్టు గుర్తించామన్నారు. నిందితులను రిమాండ్ నిమిత్తం రాజమహేంద్రవరం కోర్టుకు తరలించామన్నారు.

పిడుగుపడి గేదె మృతి



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న తహశీల్దార్

ప్రత్తిపాడు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం టి.రాయవరంలో తుఫాన్ కారణంగా పిడుగుపడి కొండి చక్రానికి చెందిన గేదె మృతి చెందింది. సంఘటనా స్థలాన్ని తహశీల్దార్ ఎం.సూర్యప్రభ పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం తగిన పరిహారం అందించే చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ హామీ ఇచ్చారు.

పేకాడుతున్న 18 మంది అరెస్ట్

రావులపాలెం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలంలో రెండు వేర్వేరు చోట్ల పేకాట శిబిరాలపై పోలీసులు దాడి చేసి 18 మందిని అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని వెదిరేశ్వరంలోని ఓ రహస్య ప్రాంతంలో పేకాట ఆడుతున్నట్టు సమాచారం రావడంతో టౌన్ సీఐ శేఖర్‌బాబు ఆధ్వర్యంలో దాడి చేసి 10 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.25,070 స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా స్థానిక శ్రీనివాసనగర్‌లో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసి 8మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.2,305 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ రెండు పేకాట శిబిరాల్లో అదుపులోకి తీసుకున్న 18 మందిపై కేసు నమోదు చేసినట్టు సీఐ శేఖర్‌బాబు పేర్కొన్నారు.

ఈదురుగాలులతో భారీ వర్షం

కొత్తపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో కాకినాడ జిల్లా ఉప్పాడ తీరంలో సోమవారం ఉదయం నుంచీ ఈదురుగాలులు వీచాయి. రాకాసి అలలు ఎగసిపడడంతో మాయాపట్నం తీరం కొంతమేర కోతకు గురైంది. సాయంత్రం వరకు బలమైన ఈదురుగాలులు కొనసాగాయి. మత్స్యకారులు ఇళ్లకే పరిమితమయ్యారు.


కాకినాడ రూరల్ హార్బరుపేటలో తుఫాన్ ముందస్తు ఏర్పాట్లపై ఆర్డీవో మల్లిబాబుతో చర్చిస్తున్న ఎమ్మెల్యే నానాజీ


కాకినాడ నగరంలోని ఏటిమొగలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండబాబు


కాకినాడ రూరల్ పగడాలపేట, తూరంగి ప్రజలకు సూచనలు చేస్తున్న రాజ్యసభ సభ్యుడు సతీష్‌బాబు, ఎమ్మెల్యే నానాజీ, ఎమ్మెల్యే రాజశేఖరం

మొంథా... ముందస్తు ఏర్పాట్లు

మత్స్యకార గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, అధికారుల పర్యటన

పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలని లోతట్టు ప్రాంతాల ప్రజలకు పిలుపు

సర్పవరం జంక్షన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో ప్రాణ, ఆస్తి నష్టాలు సంభవించకుండా ప్రభుత్వ యంత్రాంగం పటిష్ట ఏర్పాట్లు చేసిందని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ పేర్కొన్నారు. సోమవారం ఆయన ఆర్డీవో మల్లిబాబు, రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీసు అధికారులతో కలిసి వాకలపూడి హార్బర్‌పేట, లైట్‌హౌస్‌పేట, సూర్యారావుపేట, నేమాం, పోలవరం తదితర మత్స్యకార గ్రామాల్లో పర్యటించి తుఫాన్ సన్నద్ధత, ముందస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు. విద్యుత్తు సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మొంథా తుఫాన్ రాగల 24 గంటల్లో కాకినాడ సమీపంలో తీరం దాటనున్న నేపథ్యంలో బలమైన గాలులు వీచి సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందన్నారు. పల్లపు, లోతట్టు ప్రాంతాల్లో నివసించే వారంతా ఇళ్లల్లోంచి ప్రభుత్వం ఏర్పాటుచేసిన పునరావాస సహాయ కేంద్రాలకు రావాలని కోరారు. అక్కడ పూర్తిస్థాయిలో తాగునీరు, పాలు, ఆహారం, నిత్యావసరాలు, చిన్నారులకు బిస్కెట్లు, విద్యుత్తు, మరుగుదొడ్డి సౌకర్యాలు కల్పించామన్నారు. పర్యటనలో తహసీల్దారు వీఎల్ఎన్ కుమారి, ఎంపీడీవో పసుపులేటి సతీష్, డిప్యూటీ ఎంపీడీవో ఎంఎస్ఆర్ ఆంజనేయులు, సర్పవరం ఎస్‌హెచ్‌వో బి.పెద్దిరాజు, కాకినాడ రూరల్ సీఐ డీఎస్ చైతన్యకృష్ణ, తిమ్మాపురం ఎస్ఐ వై.గణేష్‌కుమార్, గ్రామ కార్యదర్శులు పిడుగు పాండురంగారావు, లక్ష్మీదేవి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కాకినాడ రూరల్ (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మండలం తూరంగి, పగడాలపేటల్లో ఎంపీ సానా సతీష్‌బాబు, ఎమ్మెల్యే పంతం నానాజీ, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, టీడీపీ నాయకుడు పెంకే శ్రీనివాస్‌బాబా పర్యటించారు. ప్రజలకు మొంథా తుఫాన్ తీవ్రతను తెలియజేసి, ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేశామన్నారు. ప్రభుత్వం ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలని ఎంపీ సూచించారు. పగడాలపేటలో పునరావాస కేంద్రాన్ని వారు పరిశీలించారు. పర్యటనలో పలువురు కూటమి నాయకులు, అధికారులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కార్పొరేషన్ (కాకినాడ) (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం సంభవించకుండా ముందస్తు చర్యలు చేపట్టామని సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, నగరపాలక సంస్థ కమిషనరు కేటీ సుధాకర్ పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం వారు పాత పోర్టు రైల్వే స్టేషన్ సమీపంలోని పూలే కాలనీలో పర్యటించారు. అక్కడ ఉన్న 200 మంది ప్రజలను దుమ్ములపేట ప్రాంతంలో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రానికి తరలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలో హోర్డింగులు, ఫ్లెక్సీలను ఇప్పటికే తొలగించామని చెప్పారు. శిథిలావస్థలో ఉన్న భవనాల్లో ఎవరూ నివసించకుండా పునరావాస కేంద్రాలకు తరలించామని కమిషనరు చెప్పారు. డ్రైనేజీలు, ప్రధాన కాలువలు పొంగకుండా కాలువల్లోని వ్యర్థాలను తొలగించేందుకు సిబ్బందిని బృందాలుగా నియమించి ఎక్స్‌కవేటర్లతో సిద్ధంగా ఉంచామన్నారు. పర్యటనలో డిప్యూటీ కమిషనరు కె.శ్రీనివాసరావు, అర్బన్ తహసీల్దారు జితేంద్ర, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కాకినాడ సిటీ (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఏటిమొగ, దుమ్ములపేట, పర్లోవపేట, కుంభాభిషేకం రేవు, కొత్త కాకినాడ, గొడారిగుంటల్లో సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పర్యటించారు. పునరావాస కేంద్రాల ఏర్పాటు, ప్రజలకు అందించాల్సిన సహాయక చర్యలను పరిశీలించారు. ఆయన వెంట స్థానిక నాయకులు తుమ్మల రమేష్, పంతాడి రాజు, బలసాడి రంగారావు, సంగాని నాగేశ్వరరావు, చోడిపల్లి సతీష్, అరదాడి శివ, మూగు రాజు, అంగడి దుర్గారావు, ఎరిపిల్లి రాము, పినపోతు జీవరత్నం, పినపోతు రాము, ఓలేటి పాండు, పాలెపు శ్రీను, బలసాడి శ్రీను, పట్టా ధనలక్ష్మి వున్నారు.

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో ఏలేరు పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప కోరారు. సోమవారం ఆయన కాండ్రకోటలో పర్యటించి ఏలేరు వరద ఉధృతిని పరిశీలించారు. ప్రాజెక్టు నుంచి నీటి విడుదల కారణంగా ఏలేరు కాలువల్లో నీటి ప్రవాహం అధికంగా ఉంటుందని, ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని సూచించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు మాట్లాడుతూ ఏలేరు ప్రాజెక్టులో అధికంగా నీరు చేరే అవకాశం ఉందని, తగు మోతాదులో నీటిని దిగువకు వదలాలన్నారు. మున్సిపల్ కమిషనరు శ్రీకాంత్‌రెడ్డి పట్టణంలోని పలు లోతట్టు ప్రాంతాలను పరిశీలించి ప్రజలను అప్రమత్తం చేశారు.

కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపట్నం, బర్మా కాలనీ, సుబ్బంపేట గ్రామాల్లో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ పర్యటించారు. తుఫాన్ ప్రభావంతో రాకాసి అలలు ఇళ్లల్లోకి దూసుకొచ్చే ప్రమాదం ఉందని, మత్స్యకారులు పునరావాస కేంద్రాలకు వెళ్లాలని ఆయన కోరారు. ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టాలు కలగకుండా కూటమి ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టిందన్నారు. వర్మ వెంట సూరాడ రాజు, అనుసూరి సత్యనారాయణ, చోడిపల్లి ప్రసాద్ తదితరులు వున్నారు.

తాళ్లరేవు (ఆంధ్రజ్యోతి): మండలంలో ఏర్పాటుచేసిన 24 పునరావాస కేంద్రాలను శెట్టిబలిజ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ టేకుమూడి లక్ష్మణరావు, తెలుగుదేశం పార్టీ తాళ్లరేవు మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు ధూళిపూడి బాబి, కట్టా త్రిమూర్తులు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వాడ్రేవు వీరబాబు, ఎస్సీ సెల్ జిల్లా ప్రతినిధి జక్కల ప్రసాదబాబు పరిశీలించారు. బాధితులకు భోజనం, వైద్యం, విద్యుత్, తాగునీరు సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. పదో క్లస్టర్ పరిధిలోని పునరావాస కేంద్రాలను టీడీపీ నేతలు మందాల గంగసూర్యనారాయణ, మోపూరి వెంకటేశ్వరరావు పరిశీలించి తుఫాన్ బాధితులను అప్రమత్తం చేశారు.

గొల్లప్రోలు (ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా భారీ వర్షాలు కురిసి సుద్దగడ్డకు వరదలు సంభవించే అవకాశం ఉన్న నేపథ్యంలో గొల్లప్రోలు పట్టణ శివారు కొత్త కాలనీ వద్ద బోటును అందుబాటులో ఉంచారు. వరద ఉధృతి అధికమైతే కాలనీ వాసులు రాకపోకలు సాగించేందుకు దీనిని సిద్ధం చేశామని తహసీల్దారు రామకుమార్ తెలిపారు.


పెద్దాపురం మండలం కాండ్రకోటలో ఏలేరు వరద ఉధృతిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప


కొత్తపల్లి మండలం ఉప్పాడ పునరావాస కేంద్రంలో మత్స్యకారులతో పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ


తాళ్లరేవు మండలంలో పునరావాస కేంద్రాన్ని సందర్శిస్తున్న తెలుగుదేశం పార్టీ నాయకులు

ఉప్పాడ తీరంలో ఎంపీ, కలెక్టర్ పర్యటన

కొత్తపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉప్పాడ తీరంలో కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ పర్యటించారు. పునరావాస కేంద్రాల్లో మత్స్యకారులతో మాట్లాడి భోజన, వసతి ఏర్పాట్లను పరిశీలించారు. ఉప్పాడ నుంచి కోనపాపపేట వరకు ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాలను కలెక్టర్ షాన్‌మోహన్ పరిశీలించారు. తుఫాన్ ప్రభావం తగ్గే వరకు మత్స్యకారులందరూ అక్కడే ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు. భోజనంతో పాటు చిన్నారులకు పాలు, బిస్కెట్లు సమకూర్చాలని నిర్వాహకులను ఆదేశించారు. కలెక్టర్ వెంట కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లిబాబు, తహసీల్దారు జి.చిన్నారావు వున్నారు. తీర ప్రాంతంలో పునరావాస కేంద్రాలను మాజీ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్ పరిశీలించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు

కార్పొరేషన్ (కాకినాడ), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ముంచుకొస్తున్న తరుణంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు కోరారు. తుఫాన్ పరిస్థితిని సమీక్షించడానికి, సహాయక చర్యలను పర్యవేక్షించడానికి నాయకులు, కార్యకర్తలు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. కలెక్టర్, ఎస్పీ, ఇతర ఉన్నతాధికారులతో సమన్వయం చేస్తూ తుఫాన్ పర్యవేక్షణలో పాల్గొనాలని కోరారు.

'సురక్షిత ప్రాంతాలకు తరలిరావాలి'

గొల్లప్రోలు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండడంతో పాటు సురక్షిత ప్రాంతాలకు తరలిరావాలని గొల్లప్రోలు తహసీల్దారు రామ్‌కుమార్, ఎస్ఐ ఎన్.రామకృష్ణ సూచించారు. సోమవారం వారు గొల్లప్రోలులోని ఎస్సీ కాలనీ, అరుంధతీయపేట, సూరంపేట తదితర ప్రాంతాల్లో పర్యటించి తుఫాన్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎంపీడీవో సెలట్ రాజు గొల్లప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని వివిధ శాఖల అధికారులతో సమావేశమై తుఫాన్ పరిస్థితిపై సమీక్షించారు.

నవావరణార్చన పూజలు

కాకినాడ సిటీ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): దేవాలయం వీధిలోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో వ్యాపారవేత్త మండవిల్లి వెంకన్నబాబు-శ్రీదేవి దంపతులు గణపతి పూజ, మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రుద్రహవనం, లింగార్చన, సూర్యనమస్కారాలు, అమ్మవారికి నవావరణార్చన, సహస్ర కుంకుమ పూజ నిర్వహించారు. ఈవో వుండవల్లి వీర్రాజు చౌదరి, ఆలయ కమిటీ సభ్యురాలు నల్లూరి తులసి, టీడీపీ 36వ డివిజన్ ఇన్‌చార్జి నల్లూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'సమన్వయంతో సమర్థవంతంగా ఎదుర్కోవాలి'

పెద్దాపురం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తుఫాన్‌ను సమన్వయంతో సమర్థవంతంగా ఎదుర్కోవాలని ఏలేరు ప్రాజెక్టు కమిటీ చైర్మన్ బస్వా వీర వెంకట నాగేంద్ర (వీరబాబు) ఆదేశించారు. సోమవారం ఆయన ఇరిగేషన్ అధికారులతో తుఫాన్ ముందస్తు జాగ్రత్తలపై సమీక్షించారు. ఏలేరు వరదల కారణంగా ఏర్పడే గండ్లు, ఏటిగట్లను పటిష్టం చేయడం వంటి అంశాలపై నీటి సంఘాలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలన్నారు. అవసరమయ్యే ఇసుక, సంచులను రెవెన్యూ శాఖ సరఫరా చేయాలని కలెక్టర్‌ను కోరినట్టు తెలిపారు. ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేసే సమయంలో ఇన్‌ఫ్లోస్‌ను పరిగణలోకి తీసుకుని జాగ్రత్తపడాలన్నారు. రైతులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలన్నారు. డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడు సోము సత్యనారాయణ, గణపతిరాజు వెంకటసుబ్బరాజు, వెదుళ్ల రాజశేఖర్, నీలం శ్రీనివాస్, ఇరిగేషన్ ఈఈ జి.శేషగిరిరావు, డీఈ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.


ఇరిగేషన్ అధికారులతో సమావేశమైన ఏలేరు ప్రాజెక్టు కమిటీ చైర్మన్ వీరబాబు


కాకినాడ జీజీహెచ్‌లో పటిష్ట చర్యలు

జీజీహెచ్ (కాకినాడ), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో కాకినాడ జీజీహెచ్‌లో సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి, అడ్మినిస్ట్రేటర్ ఎన్.శ్రీధర్ ఆధ్వర్యంలో అధికారులు పటిష్ట చర్యలు చేపట్టారు. కాలం చెల్లిన విద్యుత్ వైర్లను గుర్తించి వాటి స్థానాల్లో కొత్త వైర్లు, స్విచ్ బోర్డులు పెట్టారు. ఆసుపత్రి ప్రాంగణంలోని నీటిని మోటార్ల సాయంతో బయటకు పంపించారు. ఈదురుగాలులు వీస్తే ప్రమాదం జరగకుండా హోర్డింగులు, బ్యానర్లు, ఫ్లెక్సీలను తొలగించారు. రోగులను సురక్షితమైన వార్డులకు తరలించారు.

తుఫాన్ ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి సోమవారం సమావేశం నిర్వహించారు. అన్ని విభాగాల సిబ్బంది 24 గంటలూ అప్రమత్తంగా ఉండి రోగులకు సేవలు అందించాలని సూచించారు. అత్యవసర విభాగం, ఐసీయూలు, ఆపరేషన్ థియేటర్లతో పాటు అత్యవసర విభాగాల్లో అవసరమైన మందులు, ఆక్సిజన్ సిలిండర్లు, వెంటిలేటర్లు, జనరేటర్లు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. డ్రైనేజీ వ్యవస్థను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. ఆసుపత్రి పరిశుభ్రత, బయోమెడికల్ వ్యర్థాల తొలగింపు చర్యలను ఇన్‌ఫెక్షన్ కంట్రోల్ టీమ్ చూడాలన్నారు. ఎమర్జెన్సీ లైఫ్ సేవింగ్ డ్రగ్స్‌ను తగినంతగా నిల్వ ఉంచి 24 గంటలు అందుబాటులో ఉంచాలని ఫార్మసీ విభాగ అధికారులకు సూచించారు. విద్యుత్ సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వర్తించాలన్నారు. రక్త నిల్వలను గ్రూపుల వారీగా అందుబాటులో ఉంచాలన్నారు. శీతలీకరణ యంత్రాలు నిరంతరాయంగా పని చేసేందుకు జనరేటర్లు, బ్యాకప్ పవర్ సప్లయిలను సిద్ధంగా ఉంచాలన్నారు. పారిశుధ్య సిబ్బంది పారదర్శకంగా విధులు నిర్వర్తించాలన్నారు. రోగుల సహాయకులు నిలిపే వాహనాలపై దొంగల దృష్టి ఉంటుందని, భద్రతా చర్యలు కట్టుదిట్టం చేయాలన్నారు.

ఏపీఈపీడీసీఎల్ అధికారులు అప్రమత్తం

పిఠాపురం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో ముందుజాగ్రత్త చర్యగా ఎక్కడికక్కడ విద్యుత్ స్తంభాలను భారీగా డంప్ చేస్తున్నారు. తుఫాన్ తీరం దాటే సమయంలో 100 కిలోమీటర్లకు పైగా వేగంతో గాలులు వీస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో ఏపీఈపీడీసీఎల్ అధికారులు అప్రమత్తమయ్యారు. గాలుల తాకిడికి విద్యుత్ స్తంభాలు విరిగిపోయే అవకాశముంది. ఇటువంటి తరుణంలో యుద్ధప్రాతిపదిన స్తంభాలను మార్పు చేసి సరఫరాను పునరుద్ధరించేందుకు వీలుగా 216వ జాతీయ రహదారి వెంబడి పిఠాపురం బైపాస్, గొల్లప్రోలు వై.జంక్షన్, చేబ్రోలు బైపాస్ సహా ప్రతి 3-4 కిలోమీటర్లకు ఒక పాయింట్ ఏర్పాటుచేసి అక్కడికి లారీల్లో కరెంటు స్తంభాలను తీసుకొచ్చి క్రేన్లతో దించారు. ఈ ప్రక్రియ సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు కొనసాగింది.


పిఠాపురం బైపాస్‌లో విద్యుత్ స్తంభాలను డంప్ చేస్తున్న దృశ్యం

తిమ్మాపురం ఆవ భూములు ప్రభుత్వానివే

హైకోర్టు తీర్పు

సర్పవరం జంక్షన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మండలం తిమ్మాపురంలోని ఆవ భూములు ప్రభుత్వానికి, లీజుదారునికి చెందినవేనంటూ రాష్ట్ర హైకోర్టు సోమవారం తీర్పు ఇచ్చిందని హైకోర్టు న్యాయవాది అయినాపురపు సూర్యనారాయణ తెలిపారు. 1976లో సుమారు 450 మందికి అచ్చంపేట సన్నకారు వ్యవసాయ కార్మిక సంఘంతో పాటు మరో రెండు సంఘాల్లో ఉన్న భూమిలేని వారికి ఆవ భూములను ప్రభుత్వం లీజుకి పట్టాలు ఇచ్చింది. అయితే ఇవి తమ జిరాయితీ భూములని వి.సూర్యకాంతంతో కలిసి 80 మంది 1988లో కాకినాడ సివిల్ కోర్టులో సూట్ దాఖలు చేశారు. 2001లో ప్రభుత్వానికి, లీజుదారులకు వ్యతిరేకంగా కోర్టు తీర్పు ఇచ్చింది. దీనికి వ్యతిరేకంగా హైకోర్టులో అప్పీలు చేసుకున్నారు. సూట్ ఏఎస్ 2233/2001, ఏఎస్ 921/2002లపై విచారణ జరిగింది. సమగ్ర విచారణ అనంతరం తిమ్మాపురం ఆవ భూములు ప్రభుత్వానికి చెందినవని, ఇవి లీజుదారులకే చెందుతాయంటూ హైకోర్టు జడ్జి వి.గోపాలకృష్ణారావు సోమవారం తీర్పు ఇచ్చారని ఈ కేసును వాదించిన అడ్వకేట్ సూర్యనారాయణ తెలిపారు. హైకోర్టు తీర్పుపై లీజుదారులు హర్షం వ్యక్తం చేశారు.


ఎన్డీఆర్ఎఫ్ సభ్యులకు సూచనలు ఇస్తున్న కమాండెంట్ ప్రసన్నకుమార్

రంగంలోకి ఎన్డీఆర్ఎఫ్ బృందాలు

పిఠాపురం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావం అధికంగా ఉంటుందని భావిస్తున్న ప్రాంతాల్లో ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సోమవారం మాక్‌డ్రిల్ నిర్వహించాయి. ప్రజలకు అవగాహన కల్పించాయి. అంతకు ముందు ఎన్డీఆర్ఎఫ్ బృంద సభ్యులకు కమాండెంట్ ఎస్‌హెచ్‌వీవీఎన్ ప్రసన్నకుమార్, అసిస్టెంట్ కమాండెంట్ ఎస్‌హెచ్ కిరణ్‌కుమార్ సూచనలు ఇచ్చారు.

అన్నదాతలు, ప్రజల కలవరం

సామర్లకోట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కాకినాడ సమీపంలో తీరాన్ని తాకుతుందన్న వాతావరణ శాఖ హెచ్చరికతో వరి పంట పక్వ దశకు చేరుకుని కోతలు కోద్దామనుకున్న రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏలేరు మిగులు జలాలు విడుదల చేస్తున్నారన్న సమాచారంతో నవర, పవర, రావువారిచంద్రంపాలెం, గొంచాల, అచ్చంపేటలతో పాటు పిఠాపురం రోడ్డులోని వరి పొలాల రైతులు ముంపు బెడద తప్పదేమోనని భయపడుతున్నారు. అన్ని గ్రామాల్లో వీఆర్వోలను ప్రత్యేక పరిశీలకులుగా తహసీల్దారు కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి నియమించారు. కాలువల వెంబడి గ్రామాలైన వీకే రాయపురం, సత్యవరపుపేట, బోయినపూడి, మాధవపట్నం ప్రజలను అప్రమత్తం చేశారు. పూరి గుడిసెల్లో నివసిస్తున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అధికారులు సన్నద్ధమయ్యారు. పునరావాస కేంద్రాల్లో ఆహారం, తాగునీరు, విద్యుత్ సదుపాయాలు కల్పించేందుకూ సన్నాహాలు చేస్తున్నారు.

రైల్వే యంత్రాంగం ప్రత్యేక చర్యలు: ఏఈఎన్ ప్రభాకర్

సామర్లకోట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా భారీ వర్షాలు కురిస్తే సామర్లకోట రైల్వే ట్రాక్‌పైకి వరద నీరు చేరకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామని రైల్వే ఏఈఎన్ ప్రభాకర్ సోమవారం వెల్లడించారు. ఎగువన ఉన్న చెరువుల నుంచి వరద నీరు ట్రాక్‌పైకి చేరకుండా రైల్వే తూముల ద్వారా గోదావరి కాలువలోకి వెళ్లేలా ప్రత్యేక కాలువలు తవ్వించామన్నారు. ఏలేరు పరివాహక ప్రాంతాలైన పిఠాపురం, గొల్లప్రోలు, అన్నవరంల్లోనూ ట్రాక్‌పై నీరు చేరకుండా ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. తమ సెక్షన్ పరిధిలోని సామర్లకోట, కాకినాడ, పిఠాపురం, అన్నవరం, అనపర్తి ప్రాంతాల్లో ప్రతి 20 కిలోమీటర్లకు ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ బృందాలు ట్రాక్‌లపై నిరంతరం పెట్రోలింగ్ చేస్తూ రైళ్ల రాకపోకలకు ఎటువంటి అంతరాయం లేకుండా చూస్తాయని చెప్పారు.

'పాడి పశువులను తాళ్లతో బంధించకండి'

కొత్తపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని, పాడి పశువులను తాళ్లతో బంధించకుండా విడిచిపెట్టాలని పశుసంవర్థక శాఖ సహాయ సంచాలకుడు టి.రమేష్‌చంద్ర విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన కొత్తపల్లి పశువుల ఆసుపత్రిలో మండలంలోని వివిధ గ్రామాల వెటర్నరీ అసిస్టెంట్లతో పశువైద్యాధికారి డాక్టర్ శ్రీమన్నారాయణ మూర్తి ఆధ్వర్యంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. తుఫాన్ సమయంలో పాడి పశువులకు ఏదైనా జరిగితే తక్షణం వైద్య సేవలందించాలన్నారు.

రామారావు కుటుంబానికి రూ.50వేలు ఆర్థిక సాయం

కాకినాడ సిటీ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఇటీవల గుండెపోటుతో మరణించిన నాయీబ్రాహ్మణ సంఘం నగర మాజీ అధ్యక్షుడు, టీడీపీ నాయీబ్రాహ్మణ సాధికార కమిటీ జిల్లా సభ్యుడు సిగటాపుల రామారావు కుటుంబానికి కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు రూ.50వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ మొత్తాన్ని నగదు రూపంలో రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ పంతాడి రాజు, టీడీపీ నాయకుడు గెద్దం పూర్ణ... జె.రామారావుపేట సమ్మిడి వీధిలోని రామరావు కుటుంబ సభ్యులను కలిసి అందజేశారు. టీడీపీ నాయీబ్రాహ్మణ సాధికార కమిటీ నగర సభ్యుడు పైన శ్రీనివాసరావు, నాయీబ్రాహ్మణ సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు కింతాడ సత్యనారాయణ, జిల్లా మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ స్వయంవరపు శ్రీనివాసరావు, నాయకులు కాకినాడ ప్రసాద్, చీపురుపల్లి లోవరాజు, పోనకర్లపల్లి నరసింహ, సిగటాపుల శ్రీనివాసరావు, బండారు అప్పారావు, పట్నాల చంద్రరావు, కొయ్యన ఏసుబాబు, తగరంపూడి వాసు తదితరులు పాల్గొన్నారు.




ఇసుక బస్తాలను సిద్ధం చేయిస్తున్న సునీల్‌కుమార్

కాలువ గట్లకు గండ్లు పడకుండా రెండు వేల ఇసుక బస్తాలు సిద్ధం

కొత్తపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా వచ్చే భారీ వర్షాల కారణంగా కాలువ గట్లకు గండ్లు పడకుండా రెండు వేల ఇసుక బస్తాలను సిద్ధం చేశామని గోదావరి తూర్పు డెల్టా ఛైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్ చెప్పారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సూచన మేరకు పీబీసీ కాలువ పరిధిలో ముందస్తు జాగ్రత్త చర్యలు చేపడుతున్నామన్నారు. అత్యవసర పరిస్థితుల్లో 9515366262 నెంబరును సంప్రదించాలని ఆయన రైతులకు విజ్ఞప్తి చేశారు.

31న భవన నిర్మాణ కార్మికుల జిల్లా మహాసభ

ప్రత్తిపాడు, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల జిల్లా మహాసభలు అక్టోబరు31న జగ్గంపేటలో నిర్వహిస్తున్నట్టు సంఘ నాయకులు తెలిపారు. సోమవారం ప్రత్తిపాడు బిల్డింగ్ వర్కర్స్ భవనం వద్ద సమావేశం నిర్వహించారు. జిల్లాఅధ్యక్ష కార్యదర్శులు మెట్ల శ్రీను, రొంగల ఈశ్వరరావు మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. జిల్లా భవన నిర్మాణకార్మికుల 2వమహాసభలను అక్టోబరు31న జగ్గంపేటలో కార్మిక సమస్యలపై సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండాలి

● ఐటీడీఏ పీవో స్మరణ్ రాజ్ ఆదేశం


కంట్రోల్ రూమ్ సిబ్బందితో మాట్లాడుతున్న పీవో

రంపచోడవరం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ తగ్గే వరకు అన్ని శాఖల అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని రంపచోడవరం ఐటీ డీఏ పీవో స్మరణ్ రాజ్ ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ఆయన ఐటీడీఏ కార్యాలయంలో ఏర్పాటు చేసిన తుఫాన్ కంట్రోల్ రూమ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ కంట్రోల్ రూమ్ సిబ్బంది ఏడు మండలాల్లోని తుఫాన్ సంబంధిత సమస్యలను పర్యవేక్షించాలని ఏపీవో (జీ) డీఎన్వీ రమణను ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ పియాజ్ బాషా, బి.మార్గదర్శి, పి.లక్ష్మిరెడ్డి, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

'అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దు'


రాజవొమ్మంగి బీసీ హాస్టల్‌ను పరిశీలిస్తున్న అధికారులు

రాజవొమ్మంగి అక్టోబర్ 27 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని రంపచోడవరం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అంబేద్కర్ సూచించారు. సోమవారం ఆయన మండలంలో పర్యటించారు. రాజవొమ్మంగి మండలానికి స్పెషల్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తున్న ఈయన తహశీల్దార్ అల్లు సత్యనారాయణ, ఎంపీడీవో యాదగిరేశ్వరావుతో కలిసి గ్రామాల్లో పరిస్థితులను పర్యవేక్షించారు. రాజవొమ్మంగి, దూసరపాము, తంటికొండ, వట్టిగెడ్డ గ్రామాల్లో శిథిలమై ఉన్న అంగన్వాడీ, వసతి గృహ భవనాలు, కల్వర్టులు, కాలువలను పరిశీలించారు. అలాగే రాజవొమ్మంగి బీసీ బాలుర వసతి గృహం శిథిలావస్థకు చేరడంతో అందులో ఉన్న విద్యార్థులను తాత్కలికంగా రాజవొమ్మంగిలోని తాళ్లపాలెం ఆశ్రమ పాఠశాల భవనంలోకి మార్చమని ఆదేశించారు.

ఎటపాక: మొంథా తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో విపత్తుల సమయాల్లో జరిగే ప్రమాదాలపై పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ప్రజలను అప్రమత్తం చేసే క్రమంలో సోమవారం పలు ప్రాంతాల్లో మాక్‌డ్రిల్ నిర్వహించారు.

పర్యాటక ప్రాంతాలకు అనుమతి లేదు : ఎస్ఐ

మోతుగూడెం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రానున్న రెండు రోజులు భారీ నుంచి, అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున పర్యాటక ప్రాంతాలకు అనుమతిలేదని మోతుగూడెం ఎస్ఐ సాధిక్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఘాట్ రోడ్లో భారీ వాహనాలను నిషేధించడమైందన్నారు. అలాగే సాయంత్రం ఐదుగంటల తర్వాత ఎలాంటి వాహనాలకు అనుమతించమన్నారు. మోతుగూడెం వాటర్ ఫాల్స్, సీలేరు పిక్నిక్ పాయింట్, పుష్పబ్రిడ్జి, సోకులేరు వాగు వద్ద నీటిప్రవాహం ఎక్కువగా ఉండటం వల్ల అటువైపు పర్యాటకులు వెళ్లకుండా నిషేధం విధించామన్నారు.

వర్షాలు తగ్గే వరకు కోతలు వద్దు

దేవీపట్నం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): తుఫాన్ దృష్ట్యా వర్షాలు తగ్గే వరకు వరి కోతలు చేయవద్దని, ఒక వేళ కోతలు జరిగినట్టయితే సురక్షిత ప్రాంతాలకు పంటను చేరవేయాలని దేవీపట్నం వ్యవసాయాధికారి కే.వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని వరి, మినుము పంట సాగు చేపట్టారని, మినుము ఇంకా పంట కోత దశలో ఉందన్నారు.

తుఫాన్ పట్ల అప్రమత్తంగా ఉండండి

కూనవరం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏవో సీహెచ్ దేవి అన్నారు. సోమవారం చిన్న ఆర్కూర్ పంచాయతీ పరిధిలోని పంటలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ అధికంగా వర్షాలు కురిస్తే చేలో నీళ్ల నిల్వ ఉండకుండా చూడాలన్నారు. ఏదైనా సమస్య ఉంటే సచివాలయాల సిబ్బందిని సంప్రదించాలన్నారు.

దేవీపట్నం: తుఫాన్‌పై ప్రజలంతా అప్రమత్తంగా ఎంపీడీవో రామకృష్ణ సూచించారు. వాగులు, నదుల వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న దృష్ట్యా ఇళ్లల్లోనే ఉండాలన్నారు. అలాగే కరెంట్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఉండరాదన్నారు.

శివనామస్మరణతో మార్మోగిన శివాలయాలు

మోతుగూడెం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం పరిధి పొల్లూరు దుర్గా మల్లేశ్వర ఆలయంలో తెల్లవారు జామున నాలుగు గంటల నుంచి ప్రధాన అర్చకుడు అయినవేల్లి కుమార్ స్వామి శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు, విశేష పూజలు చేశారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ప్రెసిడెంట్ సతీష్ రాఘవన్, కార్యదర్శి ఎం. శివరామకృష్ణ, ట్రెజరర్ వేపకాయల శ్రీను, రమేష్, గోవిందరాజు, నాని, త్రిమూర్తులు పాల్గొన్నారు.

మోతుగూడెంలో విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్

మోతుగూడెం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): సర్దార్ వల్లభాయ్ పటేల్ పుట్టినరోజు సందర్భంగా ప్రతి సంవత్సరం చేపట్టే విజిలెన్స్ అవేర్నెస్ వీక్ నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా ఈనెల 27 నుంచి నవంబరు 2 వరకు సెంట్రల్ విజిలెన్స్ కమిషన్, రాష్ట్రప్రభుత్వం ఆదేశాల మేరకు ఏపీ జెన్‌కో యాజమాన్యం ఆధ్వర్యంలో లోయర్ సీలేరు చీఫ్ ఇంజనీర్ కార్యాలయంలో సెక్యూరిటీ అండ్ విజిలెన్స్ ద్వారా అవగాహన సదస్సును ఏర్పాటు చేయడం జరిగింది. కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్ కేవీ రాజారావు మాట్లాడుతూ అవినీతి నిర్మూలించడానికి అందరూ కలిసి నిబద్ధతతో పనిచేయాలన్నారు. ఉద్యోగం బాధ్యతాయుతంగా చేస్తానని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎస్. చిన కామేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు బాలకృష్ణ, నాగశ్రీనివాస్, వరప్రసాద్ సెక్యూరిటీ ఇన్‌చార్జి ప్రసాద్, ఉద్యోగ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

'సమస్యల పరిష్కారానికి కార్యాచరణ'

రంపచోడవరం, అక్టోబర్ 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కార్యకర్తలకు అండగా ఉంటూ, వారి సమస్యల పరిష్కారంపై ప్రత్యేక కార్యచరణతో ముందుకు సాగుతామని టీడీపీ మండలాధ్యక్షుడు పెంటపాటి అనంతమోహన్ అన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో 19 పంచాయతీల టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షులు, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అనంతమోహన్ మాట్లాడుతూ ఇకపై ప్రతి గ్రామం సందర్శించి సమస్యలు తెలుసుకొని పరిష్కరించేందుకు కృషిచేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో క్లస్టర్ ఇన్‌చార్జి కారం సింహాచలం, మండల కార్యదర్శి నాగన్నదొర, ఎంపీటీసీ కూర రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కుంతీదేవి ఉత్సవాలు

వీఆర్‌పురం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): వీఆర్‌పురం అంబేద్కర్ కాలనీ వాసులు, రేఖపల్లి ఎస్సీ కాలనీ వాసుల ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా జరుగుతున్న కుంతీదేవి ఉత్సవాలు సోమవారంతో ముగిశాయి. కార్యక్రమంలో యువత, గ్రామస్థులు, భక్తులు, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వైద్యులపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

రంపచోడవరం, అక్టోబర్ 27 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో ఇటీవల తల్లీ, బిడ్డ మృతికి కారకులైన వైద్యులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదయ్యే వరకు ఉద్యమం ఆగదని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను అన్నారు. ఈ మేరకు సోమవారం రంపచోడవరం పోలీస్‌స్టేషన్, గిరిజన సంక్షేమశాఖ డైరెక్టర్‌కి ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు.

వాగు దాటుతున్నగ్రామస్థులకు కౌన్సెలింగ్

అడ్డతీగల, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): వేటమామిడి పంచాయతీ పనుకురాతిపాలెం పెద్దేరువాగును సోమవారం ఎంపీడీవో ఏవీవీ కుమార్ సందర్శించారు. అదే సమయంలో అక్కడ వాగు దాటుతున్న గ్రామస్థులను ఆపి వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈయనతోపాటు అధికారులు, తదితరులు ఉన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు అధికారులు సన్నద్ధం




తొండంగి: చోడిపల్లిపేట వద్ద సముద్రం పరిస్థితిని పరిశీలిస్తున్న అధికారులు, తుని: ఇసుకులపేటలో స్థానికులతో మాట్లాడుతున్న తహశీల్దార్, కోటనందూరు:లోతట్టు ప్రాంతాలను పరిశీలిస్తున్న అధికారులు, టీడీపీ నేతలు

తొండంగి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫానును అన్ని విధాలా ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం సన్నద్ధమైంది. మండలం లోఅద్దరిపేట నుంచి చోటిపల్లిపేట వరకూ విస్తరించి ఉన్న తీర గ్రామాల్లో ప్రజల భద్రతకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. 39పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పించారు. సోమవారం ఉదయం పెద్దాపురం ఆర్డీవో శ్రీరమణి, నియోజకవర్గ ప్రత్యేకాధికారి శ్రీధర్, మండల ప్రత్యేకాధికారి లక్ష్మి, డీఎల్పీవో బాలామణి, తహశీల్దార్ కాంతారావు, ఎంపీ డీవో సాయి నవీన్‌లతో కలిసి పునరావాస కేంద్రాలను పరిశీలించారు. సౌకర్యాలను పరిశీలించి సూచనలు చేశారు. చోడిపల్లిపేట గ్రామం తీరానికి అతిసమీపంలో ఉన్నందున గ్రామస్తులను సమీపంలో ఏర్పాటు చేసిన శిబిరానికి రావాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. వృద్ధు, గర్భిణులు, చిన్నపిల్లలు ముం దుగా కేంద్రాలకు చేరుకోవాలన్నారు. అన్ని గ్రామాల్లోని అధికార్లు ఈదిశగా చర్యలు చేపట్టాలని సూచించారు. అవులమంద, లక్ష్మణుడు పేట గ్రామాల్లో కూడా పర్యటించారు. చోడిపల్లిపేట వద్ద సముద్రం పరిస్థితిని పరిశీలించారు. శిబిరాల వద్ద హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేశారు. దోమల బెడద లేకుండా ఫాగింగ్ చేయించారు. ఎటువంటి ఆస్తి, ప్రాణనష్టం జరక్కుండా ఉండేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించారు. మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలని సూచించారు.

సురక్షిత ప్రాంతానికి బోట్ల తరలింపు

తొండంగి, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి):తుఫాన్ తీవ్రత కారణంగా తీరప్రాంతంలో తెప్పలు బోట్లకు విపరీతమైన నష్టం జరిగే అవకాశం ఉందంటూ వస్తున్న హెచ్చరికల నేపథ్యంలో మండలంలోని మత్స్యకారులు తమ బోట్లను సురక్షిత ప్రాంతాలకు తరలించుకుంటున్నారు. స్థానిక కేజీపీఎల్ పోర్టు సమీపంలో సురక్షితంగాఉంటాయని అధికారుల సూచనలతోసోమవారం వాటిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు, ఎమ్మెల్యే యనమల దివ్యఆదేశాలతో సమకూరిన ఎస్కవేటర్ సహాయంతో తీరం నుంచి ఒడ్డుకు వాటిని సురక్షిత ప్రాంతాలకుతరలించారు. అద్దరిపేట, పంపాదిపేట తదితర గ్రామాల నుంచి కూడా బోట్లను ఒడ్డుకు తరలించారు. తరలింపును మత్స్యకార నాయకులు కోడ వెంకట రమణ, చొక్కా అప్పారావు, కాశీ, గంటా లక్ష్మణ్, ఎఫ్‌డీవో ఉమామహేశ్వరావు పర్యవేక్షించారు.

అధికార యంత్రాంగం అప్రమత్తం

తుని రూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో తుని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బొప్పన రాము, టీడీపీ మండలాధ్యక్షుడు చింతమనీడి అబ్బాయి, మండలంలోని 23పంచాయతీల్లో తుఫాన్ సహాయ ముందస్తు చర్యలపై సమీక్షించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ నార్ల భువన సుందరి అధ్యక్షతన మున్సిపల్ మాజీ ఛైర్మన్ యినిగంటి సత్యనారాయణ, కమిషనర్ వెంకట్రావు పలు వార్డులు పర్యటించి తుఫాన్ తీవ్రతను వివరిస్తూ ప్రజలను అప్రమత్తంచేశారు. 3మండలాల తహశీల్దార్ కార్యాల యాల్లో కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చేశారు. తుని మండలానికి 90103 78779, కోటనందూరు 9985465065, తొండంగి మండలానికి 76598 65878 నెంబర్‌లో అందుబాటులో ఉంటాయన్నారు. తుని ఇసుకులపేట వద్ద తాండవ నదీ తీరాన గుడిసెల్లో నివాసం ఉంటున్న ప్రజానీకంతో తహశీల్దార్ ప్రసాద్ సమావేశమై సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు చేపట్టారు.

ఆటోలతో ప్రచారం

ప్రత్తిపాడు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో మండల గ్రామాల్లో ఆటోల ద్వారా విస్తృత ప్రచారం చేపట్టారు. ప్రత్తిపాడులో కార్యదర్శి జ్యోతుల పద్మరాజు, ధర్మవరంలో కార్యదర్శి చెల్లుబోయిన వేణుగోపాల్ ఆటో ప్రచారాన్ని గ్రామ పురవీధుల్లో కొనసాగించి తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలు వివరించారు.

ఏలేరు ప్రాజెక్టు నుంచి నీరు విడుదల

కిర్లంపూడి, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి):ముంపు ప్రభావిత ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ అన్నరు. సోమవారం ఆయన ఏలేరు ప్రాజెక్టు ఛైర్మన్ బస్వా వీరబాబు వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏలేరుపరివాహక ప్రాంతాలైన సోమవరం, భూపాలపట్నం, ఎస్.తిమ్మాపురం, శృంగరాయునిపాలెం, గెద్దనాపల్లి, వేలంక, జగపతినగరం, రాజుపాలెం, ముక్కొల్లు పరిసర ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏలేరుప్రాజెక్టు నుంచిసోమవారం సాయంత్రం4500 క్యూసెక్కుల నీరు విడుదల జరిగిందని, కాలువల వెంబడి ప్రజలు ఉండరాదని ఇరిగేషన్ ఏఈ శ్రీనివాస్ తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జగ్గంపేట జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ కోరారు. వరద వస్తే సాయమందించడానికి జనసైనికులు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు.

లోతట్టు ప్రాంతవాసులు అప్రమత్తంగా ఉండాలి

కోటనందూరు అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ పివి.సత్యనారాయణ, లోవ దేవస్థానం మాజీ ఛైర్మన్ గాడి రాజుబాబు అన్నారు. తాండవ రిజర్వాయర్ ముంపు ప్రాంతాలైనా అల్లిపూడి, జగన్నాధపురం, కాకరాపల్లిలోని పలు ప్రాంతాలను పరిశీలించారు. తగు జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు సూచించారు. ఎస్ఐ టి.రామకృష్ణ, మార్కెట్ యార్డు ఛైర్మన్ అంకంరెడ్డి రమేష్, టీడీపీ మండలాధ్యక్షుడు పోతల సూరిబాబు, గొర్లి అచ్చియ్యనాయుడు, సామనీడి కృష్ణార్జున, రుత్తల శ్రీనివాస్ పాల్గొన్నారు.

14 పునరావాస కేంద్రాల ఏర్పాటు

రౌతులపూడి, అక్టోబర్ 27(ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో తహశీల్దార్ ఎన్వీ నరేష్, ఎంపీడీవో శివరామకృష్ణయ్య, ఎస్ఐ వెంకటేశ్వరరావు మండల గ్రామాల్లో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు. 14 పునరావాస కేంద్రాలను సిద్ధం చేయగా ఎ.మల్లవరంలో పునరావాస కేంద్రాన్ని తహశీల్దార్ టీడీపీ మండలాధ్యక్షుడు తమరాల సత్యనారాయణ, కత్తిపూడి సత్రం ఛైర్మన్ సోమరౌతు చంద్రమౌళి పరిశీలించారు.

ప్రజలు జాగ్రత్తలు పాటించాలి

గండేపల్లి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గండేపల్లి తహశీల్దార్ శ్రీనివాస్ సూచించారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో పలు శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఈదురుగాలులు, అధిక వర్షపాతం కురిసే దృష్ట్యా ప్రజలు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఏవో చంద్రరావు గ్రామాల్లో కార్యదర్శులను అప్రమత్తంగా ఆదేశించారు. ఎలక్ట్రికల్ ఏఈ కిరణ్‌కిషోర్ లైన్‌మేన్లకు విద్యుత్ సమస్యలు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. యర్రంపాలెంలో జగ్గంపేట ఉద్యాన అధికారి శ్రీవల్లి మిర్చి, ఇతర పంటలను సందర్శించి జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు సూచించారు.

పునరావాస కేంద్రాల ఏర్పాటు

ప్రత్తిపాడు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావం దృష్ట్యానియోజకవర్గం వ్యాప్తంగా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టినట్లు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ చెప్పారు. సోమవారం ఎమ్మెల్యే మాట్లా డుతూ నియోజకవర్గంలో విస్తృత స్థాయిలో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. తుఫాన్ తాకిడికి గురయ్యే ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అన్ని ఏర్పాట్లుపూర్తి చేశామన్నారు.ప్రత్తిపాడు మండలంలో 25పునరావాస కేంద్రాలు, 14జేసీబీలు, 19ట్రాక్టర్లు, 12జనరేటర్లు.. రౌతులపూడి మండలంలో 11 పునరావాస కేం ద్రాలు, 8జేసీబీలు, 5ట్రాక్టర్లు, 8జనరేటర్లు.. ఏలేశ్వరం మండలంలో 19 పునరావాస కేంద్రాలు, 6 జేసీబీలు, 10 ట్రాక్టర్లు, 8 జనరేటర్లు, శంఖవరం మండలంలో 9 పునరావాస కేంద్రాలు, 5జేసీబీలు, 14ట్రాక్టర్లు, 8జనరేటర్లు ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు ఎలాంటి భయాం దోళన చెందాల్సిన అవసరంలేదని, అవసరమైతే కం ట్రోల్ రూమ్‌లను సంప్రదించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.

'శ్రీ ప్రకాష్' విద్యార్థుల ప్రతిభ


నగదు పురస్కారాన్ని అందుకుంటున్న శ్రీప్రకాష్ విద్యార్థులు

తుని రూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): విశాఖలో బయోఎడ్వాన్స్‌మెంట్ ఫిల్టర్ పోస్టర్ ప్రజెంటేషన్‌లో శ్రీ ప్రకాష్ విద్యార్థులు సత్తా చాటారు. స్పేసెస్ డిగ్రీ కళాశాల అటానమస్ బీఎస్సీ అగ్రికల్చర్, రూరల్ డెవలప్‌మెంట్ ప్రథ మ సంవత్సరం విద్యార్థులు టి.వైష్ణవి, కె.షైనీ, ఎం.రమ్య, ఎస్.శ్యామల, ఎం.శృతి, పి.శరణ్య బృందం ఈనెల24నుంచి 26వరకు విశాఖలో జరిగిన విశాఖ లైఫ్ సైన్స్ సింపోజియం పోస్టర్ ప్రజంటేషన్ పోటీలో ప్రథమ స్థానం సాధించారు. డాక్టర్ ఉండుర్తి నరసింహదాస్ నుంచి బహుమతి, నగదు పురస్కారం అందుకున్నారు. వారిని విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాష్, ప్రిన్సిపాల్ ఎ.రామకృష్ణ రెడ్డి అభినందించారు.

తుఫాన్‌తో అధికారులు గ్రామాల బాట

ప్రత్తిపాడు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌తో సోమవారం అధికారులు గ్రామాల బాట పట్టారు. తహశీల్దార్ సూర్యప్రభ, ఎంపీడీవో ఎంఆర్ కుమార్, ఎంఈవో వి.రాజబాబుతో పాటు మండల స్థాయి అధికారులు మండల గ్రామాల్లో విస్తృత పర్యటనలు నిర్వహించారు. రైతులు ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని తెలిపారు. వేములపాలెంలో పాఠశాల భవనం దెబ్బతినడంతో కూలే ప్రమాదం ఉందని ఎంఈవో వి.రాజబాబు ఆ పాఠశాల రికార్డులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఉత్తరకంచి పాఠశాల వద్ద చెట్టు కూలే అవకాశం ఉండటంతో దానిని తొలగించే చర్యలు చేపట్టాలని ఎంపీడీవో కుమార్ బాబు దృష్టికి తెచ్చారు. సోమవారం రాత్రి ప్రత్తిపాడు తహశీల్దార్ సూర్యప్రభ, ఎంపీడీవో ఎంఆర్ కుమార్ బాబు వారి కార్యాలయాల వద్దే రాత్రి సమయంలో ఇంటికి వెళ్ళకుండా తుఫాన్ అప్రమత్తత జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

జగ్గంపేట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జనసేన జగ్గంపేట ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ అన్నారు.. ఒక ప్రకటన విడుదల చేశారు. నియోజకవర్గల వారీగా టోల్ ఫ్రీ నెంబర్లు ఇవ్వడంతో పాటు అధికారులను కేటాయించారన్నారు. డిప్యూటీ సీఎం పవన్ ఆదేశాల మేరకు జనసేన నాయకులు, కార్యకర్తలు సహాయక కార్యక్రమాల్లో పాల్గొంటారన్నారు. ఎవరికీ ఏ ఇబ్బంది వచ్చిన తనకు తెలియచేస్తే జనసైనికులతో కలిసి సహాయకరంగా ఉంటామని తెలిపారు.


ఏలేశ్వరం శివాలయంలో శివలింగానికి పూజలు చేస్తున్న భక్తులు

శైవక్షేత్రాలకు పోటెత్తిన భక్తజనం

ఏలేశ్వరం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం తొలి సోమవారాన్ని పురస్కరించుకుని ఆయా శైవక్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. ఏలేశ్వరంలోని శ్రీరాజరాజేశ్వరి సమేత శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరగ్గా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


రౌతులపూడి శివాలయంలో బారులుతీరిన భక్తులు

రౌతులపూడి (ఆంధ్రజ్యోతి): రౌతులపూడి, మేరక చామవరం గ్రామాల్లో వేకువజాము నుంచే భక్తులు ఆలయాలకు చేరుకుని పూజలు చేశారు. అరటిదొప్పల్లో దీపాలు వెలిగించారు.

ప్రత్తిపాడు(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు మండలం రాచపల్లి అడ్డు రోడ్డు వద్ద అపీత కుచాంబ అరుణాచలేశ్వర ఆలయంలో మొదటి కార్తీకమాసం సందర్భంగా విశిష్ట పూజలు నిర్వహించారు. స్వామికి లక్ష రుద్రాక్షలతో అర్చన, రుద్ర హోమం, సహస్ర జ్యోతి లింగార్చనలు జరిపారు.

ఇర్రిపాక శివాలయానికి పోటెత్తిన భక్తులు


జగ్గంపేట శివాలయంలో భక్తజనం

జగ్గంపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట మండలం ఇర్రిపాక ఏలేరు నది తీరాన మల్లికార్జునస్వామి, ప్రసన్న వెంక టేశ్వర స్వామి శివ కేశవుల క్షేత్రంలో కార్తీకమాసం మొదటి సోమవారాన్ని పురస్కరించుకుని భక్తులు వేలాదిగా వచ్చి ఏలేరులో స్నానం చేసి శివకేశవుల దర్శనం చేసుకున్నారు. భక్తులకు ఎమ్మెల్యే జ్యోతుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

గౌరీదేవికి బోనాల జాతర

ప్రత్తిపాడు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరం గౌరీదేవి అమ్మవారికి సోమవారం బోనాల జాతర నిర్వహించారు. గూడుపు వీధి రామాలయం వద్ద గౌరీదేవిని రథంపై ప్రతిష్టించి బోనాలతో వీధుల్లో ఊరేగించారు. లంపకలోవలో స్వామి అయ్యప్ప పడిపూజ సందర్భంగా గ్రామ యువకులు 108 కలశాలతో ప్రదర్శన చేశారు. అయ్యప్ప భక్తులు పేదదూళి నిర్వహించిన అనంతరం అయ్యప్పస్వామికి పడి పూజలు చేశారు.

కాపు సంఘం నూతన కార్యవర్గం

జగ్గంపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాపు సంక్షేమ భవనంలో జగ్గంపేట కాపు సంఘం సర్వసభ్య సమావేశం తాత్కాలిక అధ్యక్షుడు మీసాల చిన్నబాబు అధ్యక్షతన జరిగింది. జీను మణిబాబు, దేవరపల్లి చి.రామ్మూర్తి, బండారు రాజాలు నూతన కార్యవర్గాన్ని ప్రతిపాదించగా తులా నరసింహారావు, కురుమెళ్ళ నాగేశ్వరరావు, రాయి సాయి బలపరిచారు. అనంతరం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం గౌరవాధ్యక్షుడు జీను రాంగోపాల్, అధ్యక్షుడు దవులూరి ఈశ్వరరావు మీసాల చినబాబు, ఉపాధ్యక్షుడు తులా నరసింహారావు, మారిశెట్టి రాధా, తోట బుచ్చిరాజు, ప్రధాన కార్యదర్శి గాతోలేటి సూర్యనారాయణ, కార్యదర్శులు కురుమెళ్ళ నాగేశ్వరరావు, పి.సూరన్న, ఎ.బ్రహ్మాజీరావు కోశాధికారి మసకపల్లి భైరవ స్వామిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఏలేరు కాలువ పరిశీలన

జగ్గంపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇర్రిపాకలో శివాలయం సమీపంలో ఏలేరు కాలువను ప్రత్యే కాధికారి శ్రీనివాస్, తహశీల్దార్ జేవీఆర్ రమేష్ పరిశీలించారు. వంతెన పైనుంచి నీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలను నిలిపివేశారు. మండలంలో పునరావాస కేంద్రాలను సిద్ధం చేశామని తెలిపారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి: తుఫాన్ ప్రభావంతో కురు స్తున్న వర్షాలకు రైతులు అప్రమత్తంగా ఉండాలని ఉద్యా న శాఖాధికారిణి శ్రీవల్లి అన్నారు. మండలంలోని కాట్రావుల పల్లి, సీతానగరం, రామవరం గ్రామాల్లో పర్యటించి రైతులకు సూచనలు చేశారు.

తుఫాన్‌పై అవగాహన

గండేపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ దృష్ట్యా ప్రజలు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని తాళ్ళూరు సర్పంచ్ శీలామంతుల వీరబాబు, కార్యదర్శి షేక్ షకీలా అన్నారు. సోమవారం తుఫాన్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీఆర్వో ముక్తా వల్లి, అంగన్‌వాడీలు, సిబ్బంది ఉన్నారు.


అప్పనపాలెం వంతెన వద్ద రాకపోకలు నిలిపివేసిన అధికారులు

వంతెన పరిశీలన

ఏలేశ్వరం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఏలేశ్వరం అప్పనపాలెం మధ్య ఉన్న వంతెనను తహశీల్దార్ కుశరాజు పరిశీలించారు. వంతెనపై నుంచి రాకపోకలు నిషేదిస్తూ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. యర్రవరంలో ఎంపీడీవో రవికుమార్ వర్మ పర్యటించి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

లక్షపత్రి పూజ


లక్షపత్రి పూజలో పాల్గొన్న భక్తులు

జగ్గంపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేటకి చెందిన మాజీ సర్పంచ్ ఎం.తాతారావు సతీమణి బంగారమ్మ ఆధ్వర్యంలో ఎం.ధన బాబు, వేద దంపతులు లక్ష పత్రి పూజ నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

గండేపల్లిలో అయ్యప్పస్వామి పడిపూజ


అయ్యప్ప గురుస్వాములను సత్కరిస్తున్న దృశ్యం

గండేపల్లి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): గండేపల్లి కృష్ణుడి వీధిలో ఎల్.శ్రీను ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి పడిపూజ కార్యక్రమం నిర్వహించారు. సుమారు 500 మందికి పైగా స్వాములు పేట తుల్లి చేసి కార్యక్రమంలో పాల్గొన్నారు. గురుస్వాములు ఆయా పూజలను ఘనంగా జరిపారు. ఈ కార్యక్రమాన్ని చూసేందుకు అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.